
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 27 నవంబరు 2024




- అధికారుల కళ్లకు మామూళ్ల గంతలు
- ఒక్కో పట్టణానికి ఒక్కో రేటు
- ఉమ్మడి గుంటూరుకీ ఒక రేటు

రహదారి భద్రత రవాణా శాఖ గాలికొదిలేసింది. ఓవర్ లోడ్‌లో టిప్పర్లు రోడ్లపై దూసుకుపోతున్నా చర్యలు తీసుకోవాల్సిన రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోకుండా మామూళ్ల వసూళ్ళకు పాల్పడుతున్నారు. పనిలో పనిగా ఇటీవల మామూళ్ళ రేటు కూడా పెంచారని వాహనదారులు చెబుతున్నారు.

మామూళ్లు.. ఓవర్ లోడ్

పరిమితికి మించి లోడుతో దూసుకుపోతున్న టిప్పర్లు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి గుంటూరు జిల్లాలో రవాణా శాఖలోని కొందరు అధికారులు టిప్పర్ లారీ యజమానుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో క్వారీలు, స్టోన్ క్రషర్‌లు, ఇసుక రీచ్‌లు ఎక్కువగా ఉన్నాయి. సహజంగా లారీ లోడ్‌ని బట్టి కాకుండా సరుకు బరువుని బట్టి కిరాయి, ధర ఉంటుంది. దీంతో లారీ యజమానులు ఎక్కువ మొత్తంలో సరుకు రవాణాకు మొగ్గు చూపుతున్నారు. ఇది రవాణా శాఖ ఉద్యోగులు కొందరికి వరంగా మారింది. ఓవర్ లోడ్ వాహనాలకు పట్టణానికి ఒక ధర చొప్పున నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంకో విశేషం ఏమిటంటే రాజకీయ నాయకులు పేరు చెప్పి మరీ వసూళ్లకు దిగడం గమనార్హం.


ఓవర్ లోడ్‌తో టిప్పర్

ఓవర్ లోడు వాహనాలు గుంటూరు నగరంలోకి వెళ్లాలంటే నెలకు రూ. 17,500, తెనాలి, మంగళగిరి, చిలకలూరిపేటలలో రూ. 6,000, పిడుగురాళ్ల, నరసరావుపేట రూ. 12,000, బాపట్ల రూ. 9,000 చొప్పున చెల్లించాల్సి వస్తోందని యాజమానులు వాపోతున్నారు. అంతే కాకుండా ఉమ్మడి జిల్లా మొత్తం తిప్పాలంటే, నెలకు ఒక్కో టిప్పర్‌కు 68,000 పైగా చెల్లిస్తున్నట్టు లారీ యజమానులు బహిరంగంగానే చెబుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 500 వరకు టిప్పర్లున్నాయని, వాటిలో 70శాతానికి పైగా

(మిగతా 8వ పేజీలో)





పశువైద్యం.. దైన్యం!

- కొన్నేళ్లుగా భర్తీకి నోచుకోని పశువైద్యుల పోస్టులు
- అరకొర సిబ్బందితోనే వైద్య సేవలు
- ఆరు నెలల నుంచి మందుల పంపిణీ ఊసేలేదు
- గత ప్రభుత్వంలో పథకాలన్నింటికీ మంగళం
- శిథిలభవనాల్లో ఆసుపత్రులు...మేత అందించే విషయంలోనూ నిర్లక్ష్యమే
- పోషణ బరువై సంతలో అమ్మేసుకుంటున్న రైతులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)
మూగజీవాల వైద్యం పట్ల కూడా ప్రభుత్వాలు శీతకన్నే వేస్తున్నాయి. గత ప్రభుత్వం పశువులకు వైద్యం అందించే విషయంలో కూడా కనికరం లేకుండా వ్యవహరించడంతో పాడి రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. పేరుకే పశువైద్యశాలలు తప్ప సరిపడా సిబ్బంది మచ్చుకైనా కనిపించని దుస్థితి. మూడు నెలల కొకసారి పంపిణీ చేయాల్సిన ముందుల విషయంలో గత ప్రభుత్వం ఎడతెగని జాప్యం ప్రదర్శించి ఎన్నో మూగజీవాల మృత్యువాతకు పరోక్షంగా నాటిపాలకులు కారణమయ్యారు. కూటమి ప్రభుత్వంలోనూ అదే తంతు కొనసాగుతోంది. గడచిన ఆరు నెలలుగా పశువైద్యశాలకు మందుల పంపిణీ జరగలేదంటే నిర్లక్ష్యం ఏ రీతిన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇండెంట్ పెట్టడం జరిగిందని త్వరలోనే మందుల పంపిణీ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పశువుల విషయంలో అమలులో ఉన్న అనేక పథకాలకు గత ప్రభుత్వం తూట్లు పొడవడంతో వాటి పోషణే రైతులకు తలకు మించిన భారంగా మారడంతో చాలా వరకు సంతలో అమ్మేసుకోవాల్సిన దయనీయ పరిస్థితిని పాడి రైతులు ఎదుర్కొన్నారు. ఇక వైద్య శాల భవనాలు అయితే చాలా వరకు శిథిలావస్థలోనే దర్శనమిస్తున్నాయి. ఈ బాలారిష్టాలపై దృష్టి పెట్టాల్సిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ పశువుల ఆసుపత్రుల సమస్యలపై దృష్టి పెట్టకపోగా మూడు నెలలకొకసారి పంపిణీ చేయాల్సిన మందుల విషయంలోనూ శీతకన్నే వేసింది. ఇప్పటికైనా పశువైద్యంతో పాటు రాయితీ పథకాలన్నీ పునరుద్ధరించే దిశగా కూటమి పాలకులు చర్యలు తీసుకుంటేనే జిల్లాలో పాడి రైతు మనుగడ సాగించే పరిస్థితి ఉంటుందని లేకపోతే వ్యవసాయ అనుబంధంగా కొనసాగుతున్న పాడి పరిశ్రమ త్వరలోనే కనుమరుగు కావడం ఖాయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.


జిల్లా వైద్యశాలలో శునకానికి వైద్యం అందిస్తున్న డాక్టర్

జిల్లా పశు గణాంకాలు

పశువులు	బర్రె	గొర్రె	మేక	కోళ్ళు
16899	198009	125451	20451	3365423

గుంటూరు జిల్లాలో జిల్లా పశువుల ఆసుపత్రి ఒకటి, ఏరియా ఆసుపత్రులు 9,డిస్పెన్సరీలు 45, గ్రామీణ పశువైద్యశాలలు 39 ఉన్నాయి. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుతో పాటు,ఇద్దరు డాక్టర్లు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ 1, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు లు 10 ఖాళీగా ఉన్నాయి.

మందులు లేవు...

ఆయా పశువైద్యశాలలకు అవసరం అయిన మందుల కోసం జిల్లా పశుసంవర్ధక అధికారి కార్యాలయం నుండి నిత్యం ఇండెంట్ పెడుతూనే ఉన్నారు. గత కొద్ది నెలలుగా గ్రామీణ పశువుల ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో లేవు. ప్రస్తుతం జిల్లా కేంద్రం తో పాటు మిగిలిన చోట్ల కేవలం డీవార్మింగ్ వ్యాక్సిన్ మాత్రమే వేస్తున్నారు. మిగిలిన వ్యాక్సిన్‌లు మాత్రం బయట నుంచి తెచ్చుకోవాల్సిందే అని చెబుతున్నారు. మందులు కూడా చాలా వరకు బయటకు రాస్తున్నారు. కొన్ని మాత్రమే ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నందువల్ల మిగిలిన వాటికోసం బయటకు రాస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

ఉపయోగం సున్నా...

గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌లు ఉన్నారు. కానీ గ్రామాల్లో పెద్దగా వైద్యం అందటం లేదని పలువురు చెబుతు న్నారు. గ్రామాల్లో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్‌లు కేవలం సచివాలయంలో మాత్రమే కూర్చుని వెళ్లిపోతున్నారు.

మందులు సరఫరా చేస్తాం

డాక్టర్ ఓ నరసింహారావు, జిల్లా పశుసంవర్ధక అధికారి

జిల్లా కు మందులు వచ్చాయి.వాటిని గ్రామాల్లోని ఆసుపత్రులకు పంపిణీ చేస్తాము.అవకాశం ఉన్నంత వరకు అన్ని సేవలు అందిస్తూనే ఉన్నాము. వాక్సిన్ లు కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ ఉన్నాము.

మూడు నెలల కొకసారి....

పశువుల ఆసుపత్రులకు మందుల పంపిణీ విషయంలో ప్రతి క్వార్టర్ ప్రామాణికంగా పంపిణీ జరుగుతూ ఉంటుంది. కానీ గత ప్రభుత్వం ఈ రివాజుకు తిలోదకాలిచ్చి నెలల తరబడి మందుల పంపిణీ జరపకపోవడంతో పాడి రైతులు అధిక ధర వెచ్చించి మందులను బయటే కొనాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వంలో మందుల పంపిణీ విషయంలో అదే నిర్లక్ష్యం కొనసాగుతుండడం గమనార్హం. గడచిన ఆరు నెలలుగా పశువుల మందుల పంపిణీనే జరగలేదు. ఇండెంట్ పెట్టడం జరిగిందని త్వరలోనే అన్ని వైద్యశాలలకు మందులను సమృద్ధిగా పంపిణీ చేయడం జరుగుతుందని యంత్రాంగం చెబుతోంది

రాయితీ పథకాలన్నింటికీ మంగళం...

ప్రస్తుతం పాడి పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడడం వెనక గత ప్రభుత్వం అవలంబించిన విధానాలు కూడా కారణంగా ఉన్నాయి. ముఖ్యంగా పశుబీమా విషయంలో ఏళ్ల తరబడి జాప్యం చేసి పాడి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 2014-19 మధ్య నిర్మాణం చేపట్టిన గోకులాలకు బిల్లులు చెల్లించకపోగా ఆ పథకాన్నీ అటకెక్కించింది. ఇక దాణా విషయంలో అందించే రాయితీలపై గత ప్రభుత్వం శీతకన్ను వేయడంతో పోషణ భారంగా మారి పశువులను అయినకాడికి అమ్ముకునే దురవస్థను పాడి రైతులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూడా టీఎంఆర్ మాత్రమే అందుబాటులో ఉంది తప్పితే రైతులు మొగ్గుచూపే శైలేజీ దాణా పంపిణీ జరగడం లేదు. ఇప్పటికే గోకులం షెడ్డుల పథకాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. పశువుల దాణా విషయంలో గతంలో ఇచ్చిన రాయితీలన్నీ అమల్లోకి తేవడంతో పాటు ధర తక్కువగా ఉండే శైలేజి రకాన్ని అందుబాటులో ఉంచాలని పాడి రైతులు కోరుతున్నారు.

నడికుడి-కుక్కడం డబ్లింగ్‌కు టెండర్

- రూ. 647.88 కోట్ల అంచనావిలువతో ప్యాకేజ్ రూపకల్పన
- రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు షరతు
- పూర్తి అయితే 48 కిలోమీటర్ల రెండు వరసల రైలు మార్గం అందుబాటులోకి

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే కుక్కడం - కొండ్రపోలు మధ్యన పనులు ప్రారంభం కాగా మరో సెక్షన్ నిర్మాణాన్ని చేపట్టాలని రైల్వే శాఖ నిర్ణయించింది. నడికుడి - కుక్కడం మధ్యన ఉన్న 48 కిలోమీటర్ల పొడవునా రెండో వరస రైలుమార్గం నిర్మాణానికి ప్యాకేజ్‌ని రూపొందించింది. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో టెండర్లు పిలిచింది. రైలుమార్గంతో పాటు విద్యుదీకరణ, సిగ్నలింగ్ వర్కులను కూడా ఇందులో చేర్చింది. ఈ సెక్షన్‌లో డబ్లింగ్ ప్రాజెక్టు రూ. 647.88 కోట్ల విలువ అవుతుందని అంచనా వేసింది. ప్రీబిడ్ కాన్ఫరెన్స్‌ని డిసెంబరు 12వ తేదీన ఉదయం 11.30 గంటలకి, బిడ్డింగ్‌ని జనవరి 18వ తేదీన నిర్వహించనుంది. గరిష్టంగా 30 నెలల్లో ఈ పనిని పూర్తి చేయాలన్న షరతుని కూడా టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచింది.

గతశక్తి కార్యక్రమం కింద గుంటూరు - బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మొత్తాన్ని ఒకే ప్యాకేజీ కింద కాకుండా నాలుగైదు ప్యాకేజీలుగా విభజించి చేపట్టడం వలన త్వరగా పనులు పూర్తి అవుతాయని రైల్వే శాఖ భావిస్తున్నది. ప్యాకేజీలన్నింటిలో అత్యంత కీలకం, క్లిష్టమైనది నడికుడి - కుక్కడం సెక్షన్. ఇందుకు కారణం పొందుగల వద్ద కృష్ణానదిపై రెండో రైలు వంతెనని నిర్మించాల్సి ఉంటుంది. అంతేకాకుండా విష్ణుపురం వద్ద తెలంగాణ ప్రభుత్వం భారీ విద్యుత్ ప్లాంట్‌ని నిర్మిస్తున్నది. అక్కడ ఒక ఆర్‌వోబీ నిర్మాణం కూడా చేపడుతున్నది. కృష్ణానదిపై వంతెన నిర్మాణం అంటే అంత సులభతరం కాదు. అర కిలోమీటర్ పైగానే పొందుగల వద్ద కృష్ణానది వెడల్పు ఉన్నది. ఏటా వర్షాకాలంలో భారీగా వరదనీరు సాగర్ జలాశయం నుంచి విడుదల జరుగుతున్నది. ఈ నేపథ్యంలో వరదల సమయంలో పనులకు ఆటం కం కలిగే ప్రమాదం ఉన్నది. అయినప్పటికీ కాలపరిమితిని 30 నెలలుగానే రైల్వే శాఖ నిర్ణ యించింది.



2029 లోపే పూర్తి చేసే దిశగా అడుగులు

గుంటూరు - బీబీనగర్ రైలుమార్గం రెండు వరసలుగా అప్‌గ్రేడ్ చేసే పనులను 2029వ సంవత్సరం లోపే పూర్తి చేసేందుకు రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా ముందుకు సాగుతున్నది. అటు తెలంగాణ, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాల సహాయంతో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియని కూడా ఇప్పటికే మొదలు పెట్టించింది. మరో రెండు, మూడు నెలల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశాలున్నాయి. అప్పుడు అన్ని సెక్షన్లలో పనులు ప్రారంభమౌతాయని అధికార వర్గాలు తెలిపాయి. ఏది ఏమైనా ఈ ప్రాజెక్టు పూర్తి అయితే గుంటూరు రైల్వే డివిజన్ మీదగా రైళ్లు, సరుకు రవాణ చేసే గూడ్స్‌ల రాకపోకలు పెరిగి ఆదాయం రెట్టింపు అవుతుంది. అంతేకాకుండా గుంటూరు - సికింద్రాబాద్ మధ్యన ప్రయాణ సమయం నాలుగు గంటల కంటే తక్కువ సమయానికి తగ్గిపోతుంది.

పది ఫలితాల్లో.. అగ్రస్థానానికి ప్రణాళికలు

- త్వరలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ
- సాయంత్రం అల్పాహారం అందిస్తాం
- ఫ్లస్-2 పాఠశాలల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాల కోసం కృషి
- 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో సీవీ రేణుక



గుంటూరు(విద్య),నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభించామని, త్వరలో జడ్పీ నిధులతో తయారైన స్టడీ మెటీరియల్ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న గుంటూరు జిల్లా డీఈవో సీవీ రేణుక వెల్లడించారు. పదవ తరగతి పరీక్షల కార్యాచరణ, ఫ్లస్-2, తదితర అంశాలపై ఆమె మంగళవారం ఆంధ్రజ్యోతిలో మాట్లాడారు. గత ఏడాది పది పరీక్షలకు 27,178 మంది హాజరుకాగా వారిలో 23,955 మంది(88.14శాతం) ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 16వ స్థానంలో నిలిచింది. విద్యార్థుల్లో ప్రథమ డివిజన్ సాధించిన వారు 19689మంది, ద్వితీయ డివిజన్ సాధించిన వారు 3031 మంది, తృతీయ డివిజన్‌సాధించిన వారు 1235 మంది ఉన్నారు. పదిలో 590 పైగా మార్కులు సాధించిన వారు 59మంది మాత్రమే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రాష్ట్రంలో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ఉన్నత స్థాయిలో అధికారులు, క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు సమష్టి కృషి చేస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక స్పష్టం చేశారు.

ఈ ఏడాది పదిలో మెరుగైన ఫలితాల కోసం కార్యచరణ ఏమిటి?

డీఈవో: జిల్లాలో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి 11,096 మంది ప్రైవేటు విద్యాసంస్థల నుంచి 20వేల చొప్పున మొత్తం 31 వేల మందికిపైగా విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇప్పటికే సిలబస్ దాదాపు పూర్తి అయింది. విద్యార్థులకు ఉదయం ,సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి సబ్జెక్టుల వారీగా విద్యార్థుల్ని పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ప్రైవేటు యాజమాన్యాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా దిశానిర్దేశం చేస్తాం

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, అల్పాహార పంపిణీ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు?

డీఈవో: స్టడీ మెటీరియల్ డిసెంబరు మొదటి వారంలో ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో దీనిని రూపొందించాం. ఇప్పటికే అన్ని సబ్జెక్టుల స్టడీ మెటీరియల్ సిద్ధం అయింది. ఆంగ్ల మాధ్యమం తోపాటు తెలుగు మాధ్యమం విద్యార్థులకు అందిస్తాం. పది పరీక్షలకు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం కోసం జడ్పీ త్వరలో నిధులు కేటాయించనుంది. ఒక్కో విద్యార్థికి ఎంత మొత్తం వెచ్చించాలో ఉపాధ్యాయుల నుంచి సమాచారం తీసుకున్నారు.

నాడు నేడు పనుల పురోగతి ఎలా ఉంది?

డీఈవో: జిల్లాలో నాడు నేడు పథకం ద్వారా మంజూరైన భవనాల నిర్మాణం మందకొడిగా ఉందని, త్వరలో ఎస్ఎస్ఏ అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు వేగం పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీఎంశ్రీ పాఠశాలల పరిస్థితి ఏమిటి?

డీఈవో: గుంటూరు జిల్లాలో తొలి విడద పీఎంశ్రీ (ప్రధాన మంత్రి పాఠశాలలు) పథకానికి 21 పాఠశాలలు ఎంపికయ్యాయి. రెండో విడత నాలుగు పాఠశాలలు ఎంపిక అయ్యాయి. రానున్న అయిదు సంవత్సరాల్లో ఆయా పాఠశాలల్లో ల్యాబులు, ఆట స్థలాలు, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో తరగతి గదులు సమకూర్చడానికి దశల వారీగా కేంద్రం ఒక్కో పాఠశాలకు రూ. 2 కోట్లు ఇవ్వనుంది. ఈ నిధులతో పూర్తి స్థాయిలో పాఠశాలల్లో అభివృద్ధి జరుగుతుంది.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయం సమీక్షించారా?

డీఈవో: త్వరలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలో సమీక్ష నిర్వహిస్తాం. ప్రభుత్వం నిర్ధేశించిన విధంగా ఫీజులు వసూలు చేస్తున్నారా? లేదా అని పరిశీలిస్తాం. కొన్ని పాఠశాలల్లో పరీక్షల సమయంలో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై నిఘా పెట్టి సదరు పాఠశాలలపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం.

ఫ్లస్-2 పాఠశాలల్లో ఫలితాలపై సమీక్షించారా?

డీఈవో : గత ఏడాది మాదిరి కాకుండా ఈ ఏడాది ఫ్లస్-2 పాఠశాలల్లో మెరుగైన ఫలితాల కోసం చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడా సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా ఏర్పాట్లు చేశాం. విద్యార్థుల్ని సమర్థవంతంగా పరీక్షలకు సిద్ధం చేసి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నట్లు డీఈవో రేణుక స్పష్టం చేశారు.

కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి 6
తప్పులు రహిత ఓటర్ల జాబితా రూపొందించాలి
ఓటర్ల జాబితా పరిశీలకులు సూర్యకుమారి



- ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు
- ఏఎన్‌యూలో ప్రారంభమైన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

పోటీతత్వం కన్నా క్రీడా స్ఫూర్తి గొప్పది

8
సూర్యలంక తీరంలో బీచ్‌వాలీబాల్ పోటీలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన, కలెక్టరు
- 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు


అంతర్‌జిల్లాల బీచ్‌వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

ముగిసిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ప్రథమ స్థానంలో నిలిచిన రోజా ఎవేంజలిన్‌కు ప్రశంసా పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలు, క్రీడల్లో రాణించడం వల్ల విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉంటారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కన్నా మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలని, వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహం ఉంటే గొప్ప శాస్త్రవేత్తలుగా తయారవుతారని అన్నారు. అనంతరం జరిగిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ముందుగా రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఆధ్వర్యంలో కన్నాను ఘనంగా సన్మానించారు.

'విశాఖ'కు ప్రథమ బహుమతి

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లాకు చెందిన ఎం రోజా ఎవేంజలిన్, ప్రవల్లిక, సాయి ప్రియలకు ప్రథమ బహుమతిని, ద్వితీయ బహుమతి మన్యం జిల్లాకు చెందిన గౌతమ్‌లకు ప్రశంసా పురస్కారం, షీల్డ్‌లతో పాటు మరో 30 మందికి నగదు ప్రోత్సాహక బహుమతులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గురుకుల కళాశాలల అడిషనల్ సెక్రటరీ కే సునీల్‌రాజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సంజీవ రావు, జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ, కళాశాల ప్రిన్సిపల్ జాన్సన్, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ఉన్నారు.

ప్రకృతి, సాంకేతికతలలో వికృతత్వం లేదు

పెదకాకాని, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రకృతి, మారుతున్న సాంకేతికతలలో వికృతత్వం లేదనీ, మనిషి ఆలోచనలలోనే వికృత భావాలు ఉన్నాయని, మనిషి తన మేధస్సును సమాజ హితం కోసం ఉపయోగించాలని ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పాత్రికేయవిద్యా విభాగంలో మంగళవారం 'విలువలతో కూడిన పాత్రికేయం' అనే అంశంపై ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయం అంటే ప్రజా సమస్యలపై పోరాడే పాశుపతాస్త్రం అని అన్నారు. వ్యక్తిగత వికాసానికే కాకుండా, పది మంది పురోగతికీ ఉపయోగపడాలన్న కోరిక ఉన్న వారికి సరైన ఎంపిక పాత్రికేయ రంగ మని వ్యాఖ్యానించారు. పాత్రికేయ రంగంలో గత ఆరు దశాబ్దాలుగా వచ్చిన మార్పులను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లుగా సోదాహరణంగా విపులీకరించారు. పాత్రికేయ వృత్తిలో ప్రతిభాపాటవాలు చూపితే సమాజంలో పేరుప్రఖ్యాతలు సంపాదించుకోవచ్చని ఫ్రీలాన్స్‌గా కూడా పని చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. జర్నలిస్టులకు సామాజిక బాధ్యత తప్పనిసరిగా ఉండాలని, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా భావించాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగని మనస్తత్వం అవసరం అని మంచి వార్తలు, వార్తల్లోని జీవన స్థితి గతులను గుర్తించే నేర్పు ముఖ్యం అని సూచించారు. కార్యక్రమంలో పాత్రికేయ విద్యా విభాగాధిపతి ఆచార్య కె.జ్యోతిర్మయి, టీవీ అండ్ ఫిల్మ్ కోర్సుల సమన్వయకర్త ఆచార్య జే మధుబాబు, అధ్యాపకుడు ఎం మాణిక్యరావు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 586.80 అడుగులు ఉంది. ఇది 304.46 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3431 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20,787 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 36,918 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 36,918 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది





ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి, దివ్యాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

ప్రజాదర్బార్‌లో విన్నపాల వెల్లువ

● అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తానని మంత్రి హామీ

తాడేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ 47వ రోజుకు చేరుకుంది. ఉండవల్లి కరకట్ట వద్ద లోకేశ్ నివాసంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు అర్జీదారులు భారీగా విచ్చేసి తమ సమస్యలు విన్నవించారు. అందరి విజ్ఞప్తులను పరిశీలించిన లోకేశ్, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సంబంధిత శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ భరోసా ఇవ్వడంతో అర్జీదారులు సంతోష పడ్డారు. దివ్యాంగుల నుంచి కూడా వినతిపత్రాలు స్వీకరించిన లోకేశ్, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌లు మంజూరుకు వినతి

గుంటూరులోని ఎన్టీఆర్ అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ (గుంటూరు మిర్చియార్డు)లో కమీషన్ ఏజెంట్ లైసెన్స్‌లు మంజూరు చేయాలని టీ లక్ష్మారెడ్డి, షేక్ చినబాజి, విజ్ఞప్తి చేశారు. 2018లో కుటుంబ జీవనోపాధి కోసం కొంతమందికి మిర్చి వ్యాపారం చేసుకునేందుకు కమీషన్ లైసెన్స్ మంజూరు చేసేందుకు అప్పటి పాలకవర్గం యార్డు సెక్రటరీ తీర్మానం చేశారని, అనంతరం వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

ఉద్యోగావకాశం కల్పించండి

తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన తండ్రి గుండెపోటుతో 2006లో మరణించారని, అన్ని అర్హతలు ఉన్న తనకు కారుణ్య నియామకం కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన సరిశెట్టి సాయి సునీత విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ లైంగిక వేధింపులు

తనను లైంగికంగా వేధించిన తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ కళాశాల సూపరింటెండెంట్ కేవీఎస్ రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తున్న ఓ మహిళ ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్‌పై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, తనను అక్రమంగా బదిలీ చేశారని, న్యాయం చేయాలని కోరారు.

విలువైన భూములు ఆక్రమించారు

తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులమనే కక్షతో గత వైసీపీ పాలనలో తమపై అక్రమంగా కేసులు నమోదు చేయడంతోపాటు విలువైన తమ భూములు ఆక్రమించు కున్నారని సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం రెక్కమానుకు చెందిన కేసుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే సిద్దారెడ్డి దురాగతాలతో తాము ఊరి విడిచి వెళ్లాల్సి వచ్చిందని, అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు.

భూములు కోల్పోయాం.. న్యాయం చేయండి

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని కడప జిల్లా, యర్రగుంట్ల మండలం, ఇండ్లసిద్దాయపల్లె భూనిర్వాసితులు విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు.

స్థలం ఆక్రమించి నిర్మాణాలు

నెల్లూరు జిల్లా ముత్తుకూరులో తమ 320 చదరపు గజాల స్థలాన్ని ఏ శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఆక్రమించిందని, విచారణ చేసి న్యాయం చేయాలని పూడిపర్తికి చెందిన ఇందిరమ్మ విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానంలో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా, దౌర్జన్యంగా తమ స్థలంలో నిర్మాణాలు చేశారని, పోలీసులు పట్టించుకోలేదని న్యాయం చేయాలని కోరారు.

కొత్త ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి

● ఓటర్ల జాబితా పరిశీలకులు సూర్యకుమారి

● తప్పులు రహిత ఓటర్ల జాబితా రూపొందించాలి



సమావేశంలో శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఓటర్ల జాబితా అబ్జర్వర్ సూర్యకుమారి, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, తప్పులు లేని ఓటర్ల జాబితాలను రూపొందించేందుకు కృషి చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా పరిశీలకులు సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల సవరణలపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సూర్యకుమారి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించేందుకు పకడ్బందీగా పరి శీలించాలని అన్నారు. రానున్న నెల రోజుల్లో ఓటర్ల జాబితాల రూప కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి, ఇందుకు బీఎల్‌ఓ, ఈఆర్‌ఓలు సమా వేశం నిర్వహించాలని సూచించారు. జిల్లాలో 18-20 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతను ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా నమోదుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా తయారీ సమయంలో ఈపీ రేషియో, జెండర్ రేషియో అం శాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించుకోవాలని, ఓటరుగా నమోదు, సవరణకు అర్హులైన వారు ఫారం 6, 7, 8 దరఖాస్తు ఫారాలను భర్తీ చేసి అందజేయాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయపక్షాల ప్రతినిధులు భాగస్వాములు కావాలని కోరారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజవర్గాల్లో ఓటరు జాబితాకు సంబంధించి అక్టోబరు 29 నాటికి 17,35 365 మంది ఓటర్లుగా నమోదయ్యారని, వారిలో 8,46,793 మంది పురుషులు ,8,88,385 మంది మహిళలు, 187 మంది ఇతరులు ఉన్నట్లు వివ రించారు. జిల్లాలోని 1932 పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని, 2025 ఓటర్ల జాబితా సవరణలో భాగంగా నవంబరులో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. డిసెంబరు 24 నాటికి అభ్యంతరాలను పరిష్కరించడం పూర్తిచేస్తామని, తుది జాబితాను 2025 జనవరి 6న ప్రకటించడం జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్‌వో ఐమురళీ తదితరులు పాల్గొన్నారు.

నా జీవితానికి మా నాన్నే స్ఫూర్తి

● ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నాం

● డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమల రావు

● వేడుకగా సిహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల సభ




పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, జీఎస్ చలంతో డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉన్నత స్థాయిలో ఎదగడానికి మా నాన్న అందించిన జీవిత విలువలు అమూల్యమైనవని, ఉద్యోగంలో, జీవితంలో ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నానని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై మంగళవారం జరిగిన సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తన చిన్నతనంలోనే తన తండ్రి పదవీ విరమణ పొందారని అన్నారు. నిరాడంబరంగా జీవిం చారని, సమర్థతతో పాటు, నీతి నిజాయితీలకు లోబడి పనిచేశారని గుర్తుచేశారు. ఆయన పేరుతో అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న అవార్డుల ప్రక్రియ వెనుక తన సోదరి సుశీలమ్మ చేస్తున్న కృషి గొప్పదన్నారు.

అవార్డులను స్వీకరిస్తున్న పాపినేని శివశంకర్, జీఎస్ చలంను అభినందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ నిర్వాహకురాలు డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ మాట్లా డుతూ సాహిత్య విమర్శకులను గుర్తించి, గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించి గత ఐదేళ్లుగా ప్రముఖులకు తమ తండ్రి పేరున పురస్కారాలు అందజేస్తున్నట్లు వివరించారు. పురస్కార గ్రహీతలు పాపినేని శివశంకర్, జీఎస్ చలం మాట్లాడుతూ కవిత్వానికి, కథకు పురస్కారాలు ఇస్తారు కానీ సాహిత్య విమర్శకు అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి పురస్కారాలతో మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. అనంతరం 2023 సంవత్సరానికి పాపినేని శివశంకర్‌కు, 2024 సంవత్సరానికి ప్రముఖ విమర్శకు రచయిత చలంకు డీజీపీ చేతుల మీదగా పురస్కారాలు అంద జేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎక్సైజ్ కమిషనర్ అహమద్ షరీఫ్, డాక్టర్ ఓ వీ రమణ, డాక్టర్ వీవీ రామకుమార్, పలు రచయితలు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

జపాన్‌లో కార్తీక వన సమారాధన

● వన భోజనాల్లో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు



వనసమారాధనలో పాల్గొన్న రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలు

గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు ఎక్క డున్నా మన సంస్కృతి, సంప్రదాయా లకు పెద్దపీట వేస్తూనే ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగి, ప్రతి కుటుంబం శ్రద్ధా భక్తులతో జరుపుకునే కార్తీక వన సమారాధన సువాసనలు జపాన్ లోనూ వ్యాపించాయి. జపాన్‌లో నివా సం ఉంటున్న తెలుగు ప్రజలు టోక్యోలోని ఓజీమాకు వచ్చి కార్తీక వనసమారాధన జరుపుకున్నారు. ఈ సందర్భంగా పురుషులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటాపాటలతో తెలుగు వారి ఐక్యతను చాటారు. చివరిలో పసందైన విందు భోజనంతో వన దేవతకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తెలుగు ప్రజలందరూ పాల్గొన్నట్లు జపాన్ తెలుగు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రతి తెలుగు పండుగ జపాన్‌లో జరుపుకుంటునట్లు పేర్కొన్నారు. మన సంస్కృతీ సంప్రదాయం, ముఖ్యంగా పండుగ రోజు కనిపించే వస్త్రధారణ అక్కడి ప్రజలను అమితంగా ఆకట్టుకుంటాయని తెలిపారు.

46,945 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 49,929 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,945 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 36,376 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	14000
నెంబరు. 5	8000	14000
273	8000	9000
341	9000	14000
4884	10500	10500
సూపర్ 10	12000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16300
బ్యాడిగి	7500	12500
దేవనూరు డీలక్స్	8500	14000
తెల్లకాయలు	4500	11000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	13000
నెంబరు.5	8500	12000
273	--	–
341	10000	14500
4884	8000	12000
సూపర్ 10	13300	13300
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16500
బ్యాడిగి	9500	12500
దేవనూరు డీలక్స్	9000	14500
తెల్లకాయలు	4500	10000

పంచాయతీ సెక్రటరీ వేధింపులు తాళలేక మరణిస్తున్నా..

● తాళ్లపల్లి సచివాలయ సర్వేయర్ యేసురాజు సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియో చేస్తున్న సర్వేయర్ యేసురాజు

మాచర్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ సెక్రటరీ తనను వేధింపులకు గురిచేస్తున్నాడని ఆ వేధింపులు తట్టుకోలేక చనిపోతున్నానని సచివాలయ సర్వేయర్ సెల్ఫీ వీడియో కలకలం రేపుతుంది. వివరాలు ఇలా వున్నాయి. పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని తాళ్లపల్లి పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న ఆవుల వెంకట్రామయ్య తనను వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేక మరణిస్తున్నానని అదే గ్రామ సచివాలయ సర్వేయర్ యేసురాజు సెల్ఫీ వీడియో చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతూ కలకలం రేపుతోంది. గ్రామ సమీపంలోని సాగర్ కుడికాలువ వద్ద మంగళవారం ఈ సెల్ఫీ వీడియో చేశారు. తన పేరు యేసురాజు అయినప్పటికీ తాను యాదవ సామాజికవర్గానికి చెందిన వ్యక్తినని, అయితే నువ్వు మాదిగ కులానికి చెందిన వాడవురా.. నేను చెప్పినట్టు నువ్వు వినాలి.. నా కాళ్ల బూట్లు తుడవాలి అంటూ వెంకట్రామయ్య వేధిస్తున్నారని యేసురాజు తన సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్య వేధింపులు తాళలేక మరణిస్తున్నానని, ఈ వీడియోనే తన మరణ వాంగ్మూలంగా భావించాలని ఆ వీడియోలో యేసురాజు చెప్పారు. కాగా వీడియో అనంతరం యేసురాజు కనిపించడం లేదు. దీనిపై మాచర్ల రూరల్ పోలీసులను వివరణ కోరగా విచారిస్తున్నట్లు చెప్పారు.



ఫిట్‌నెస్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఐజీ త్రిపాఠి

ఎస్సై ఉద్యోగోన్నతులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సై ఉద్యో గోన్నతుల కోసం నిర్వహించిన పరీక్షలను సౌత్ కోస్టల్ జోన్ రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్ పగ డ్బం దీగా నిర్వహించారు. రెండవ రోజు మంగళవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదా నంలో ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమాండెంట్ ఎస్పీ నగేష్ బాబు, ప్రకాశం జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గుంటూరు రేంజ్ పరిధిలోని 5 జిల్లాలు గుంటూరు, ప్రకాశం బాపట్ల, నెల్లూరు, పల్నాడులలో పనిచేస్తున్న 58 మంది ఎస్సై స్థాయి ఉద్యోగోన్నతి కోసం ఔట్ డోర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షార్థులకు సీట్ టర్న్ అవుట్, ఫుట్ డ్రిల్, వెపన్ డ్రిల్, వెపన్ హ్యాండ్లింగ్, మార్చ్ పాస్ట్, నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ మొదలగు వివిధ అంశాలకు సంబంధించి పరీ క్షలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్లరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని హైవేపై మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఇసుకపల్లికి చెందిన నీలం శ్రీనివాసులు (32) తన ద్విచక్రవాహనంపై రేపల్లె నుండి ఒంగోలుకు వెళుతుండగా బాపట్ల మండలం కనకాద్రినగర్ సమీపంలోని హైవేపై వెళుతున్నాడు. వేగంగా ద్విచక్రవాహనం నడుపుతుండగా అదుపు తప్పి ఎదురుగా ఉన్న టాటా ఏస్ ఆటోను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఈ మేరకు రూరల్ పోలీసులకు సమాచారం అందించటంతో క్షతగాత్రుడిని వైద్యం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ కె.గంగాధరరావు తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శివన్నారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్నఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్

పిట్టలవానిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని రజకపాలెం గ్రామానికి చెందిన మేత్ర శివన్నారాయణ (56) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత భేదాభిప్రాయాల కారణంగా తన భార్యా పిల్లలు నుంచి వేరుబడి జీవిస్తున్న శివన్నారాయణ, కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి తన స్వగృహంలోని ఇంటికప్పుదూలానికి శివన్నారాయణ ఉరివేసుకున్నాడు. శివన్నారాయణ అన్న కుమారుడు మేత్ర ఏడుకొండలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు.

అర్ధరాత్రి కోడి పందేలు

● గాజుల్లంక ఇటుక కల్లాల్లో ..

● పోలీసుల రాకతో పారిపోయిన పందెంరాయుళ్లు

కొల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి భారీ స్థాయిలో కోడిపందేల బరిలు ఏర్పాటు చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేయడంతో పందెంరాయుళ్ల పరారయ్యారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇటుక కల్లాల్లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో డీజే వాయిద్యాలతో కోడి పందేలు వేసేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. భారీ స్థాయిలో కోడి పందేలు జరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ ఏడుకొండలు సిబ్బందితో కలిసి ఆ స్థావరంపై ఆకస్మిక దాడులు నిర్వ హించారు. దీంతో పందెం రాయుళ్ల పరారయ్యారు. నలుగురు వ్యక్తులను, ఒక కారు, ఆరు ద్విచక్ర వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కోడిపందేల బరిని గాజుల్లంకకు చెందిన మత్తి నరేంద్ర అనే వ్యక్తి ఏర్పాటు చేశాడని సమాచారం ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనిని కూడా అదుపులోకి తీసుకోనున్నట్టు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111,119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గుంటూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధితో ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసాగా నిలుస్తున్నారని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గుంటూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. శివారు కాలనీల్లో అనేక చోట్ల సరైన రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రశంసా పత్రాలు

గుంటూరు(విద్య),నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బెస్ట్ ఎన్‌సీసీ క్యాడెట్లుగా ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు చెందిన షేక్ మహమ్మద్ మహారాజ్‌బాషా, సార్జంట్ రాజశేఖర్ అనే క్యాడెట్లు గ్రూపు కమాండర్ ఎం.చంద్రశేఖర్, ఆఫీసర్ ఇన్ కమాండింగ్ కల్నల్ నీరజ్‌కుమార్ చేతుల మీదుగా ఎన్‌సీసీ డే సందర్భంగా పత్రాలు అందుకున్నారు. క్యాడెట్లను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు అభినందించారు.

తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం తగదు

గుంటూరు(విద్య), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంగ్లభాష మోజులో తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం తగదని సాహితీ సమాఖ్య కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ స్కూల్‌లో తెలుగు భాష వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. పాఠశాల కార్యదర్శి మేకల రవీంద్రబాబు, డైరెక్టర్ మేకల శేషకుమారి, తెలుగు ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి, జయశ్రీ, పి.సుధాకర్‌నాయుడు, హెచ్‌ఎం మీనాక్షి పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది.

నేడు మస్తాన్ దర్గా వెనుక ఆక్రమణల తొలగింపు

గుంటూరు, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మస్తాన్ దర్గా వెనుక వైపు ఉన్న ఓల్డ్ క్లాత్ బజార్‌లో పెద్ద ఎత్తున ఆక్రమణలు బుధవారం తొలగించేందుకు రంగం సిద్ధమైంది. అక్కడి ప్రైవేట్ స్థలాలను కొందరు ఆక్రమించి ఎన్నో సంవత్సరాలుగా నివాసాలు ఉంటూ పాత దుస్తులు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయా ప్రైవేట్ స్థలాల యజమానులు ఎన్ని సార్లు ఖాళీ చేయాలని కోరినా ఖాళీ చేయకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయా ఆక్రమణలను తొలగించాల్సిందిగా కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో తొలగింపు సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్ మంగళవారం రాత్రి వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయాల్సిందే : సునీత

గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాల్లో రాత్రి 7.30 గంటల వరకు పత్తి కొనుగోలు చేయాల్సిందేనని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ విజయ సునీత అన్నారు. మంగళవారం ఆమె నల్లపాడులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని కొనుగోలు చేయాలని బయ్యర్లకు సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీ బూసిమి రాజబాబు, యార్డు కార్యదర్శి వినుకొండ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో బోటింగ్ పాయింట్ ఏర్పాటు

● హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ మంజుల

గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని శిల్పారామంలో బోటింగ్ పాయింట్, కన్వెన్షన్ హాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు వెంటనే చేపడతామని ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ చేరెడ్డి మంజుల వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆమె గుంటూరు శిల్పారామంను సందర్శించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. శిల్పారామంలోని ఆర్టిజన్ స్టాల్స్ సందర్శించి వారితో మాట్లాడి కళలు, కళాకారులను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.





కలెక్టరేట్‌లో జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు | అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

రాజ్యాంగం ఎంతో గొప్పది : కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్వమతాలు, కులాలను గౌరవించే భారత రాజ్యాంగాన్ని 75 సంవత్సరాల క్రితం నవంబరు 26వ తేదీన ఆమోదించుకోవడం గొప్ప పరిణామం అని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి కార్యక్రమంలో పాల్గొన్న అందరి చేత భారత రాజ్యాంగం ప్రవేశికను చదివించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగ దినోత్సవం నగరంలో ఘనంగా నిర్వహించారు. దేశ ప్రజలకు అంబేద్కర్ అందించిన గొప్పవరం భారత రాజ్యాంగమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరు లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవిస్తామని ప్రమాణం చేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకూ ర్యాలీని ఎమ్మెల్యే గళ్లా మాధవి జెండా ఊపి ప్రారంభించి, ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి ఎస్సీ సెల్, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాకోబు, ముత్తినేని రాజేష్, కసుకుర్తి హనుమంతురావు, రావిపాటి సాయి, అబ్దుల్ రహీం, చంద్ర గిరిబాబు, మల్లె ఈశ్వరరావు, గుర్రం ప్రసాద్ పాల్గొన్నారు.

● తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలు కాపాడేది రాజ్యాంగమేనని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు గుడిమెట్ల దయారత్నం, చిలక వెంకటేశ్వర్లు, సింహాద్రి, ఆనంద్, కార్పొరేటర్లు ఎల్లావుల్లా అశోక్, పోతురాజు చంద్ర, మహంకాళి నరసింహారావు, చల్లా ఆంజనేయ ప్రసాద్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

● టీడీపీ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, బొల్లెద్దుల సుశీలరావు, గుడిమెట్ల దయారత్నం, యర్రగుంట్ల ఆనంద్, హుస్సేన్, షేక్ చిన్న బాజీ, బెల్లంకొండ సురేష్ పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగమని, అదే దేశానికి రక్షణ అని ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ పరిపాలన కాలంలో రాజ్యాంగం విచ్ఛిన్నం అవడం వలనే రాజ్యాంగ విలువ రాష్ట్ర ప్రజలకు తెలిసిందని, చంద్రబాబు ద్వారా నిజమైన రాజ్యాంగ పరిపాలన కొనసాగుతోందన్నారు.

● కన్నావారితోటలోని జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎస్టీ అధికారులు, రక్తదానం చేశారు. కేంద్ర జీఎస్టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రక్తాన్ని దానం ఇవ్వడం అనేది చాలా ముఖ్యమైన విరాళంగా పేర్కొన్నారు. తొలుత కమిషనర్ ఉద్యోగుల చేత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎం భాస్కరరావు, జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కమిషనర్ బి రవికుమార్, సూపరింటెండెంట్లు చీదేళ్ళ ఈశ్వరరావు, గాదె శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

● గుంటూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో సివి రేణుక మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రాజ్యాంగ పీఠిక గురించి తెలియజేస్తూ ఉద్యోగుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మల, పరీక్ష విభాగం ఏడీ కె.వెంకటరెడ్డి, ఉర్దూ డిఐ ఎస్‌కె ఎండీ ఖాసిం, పర్యవేక్షకులు బాలకృష్ణ, జగదీష్ పాల్గొన్నారు.

● అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని బ్రాడీపేటలోని దివ్యాంగుల శిక్షణా కేంద్రంలో పుస్తక పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు నగర కార్యదర్శి ఈశ్వర్ లాల్ పవార్ వెల్లడించారు. టీజేపీఎస్ కళాశాల అధ్యక్షుడు వంశీ, దివ్యాంగుల శిక్షణా కేంద్రం కార్యదర్శి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక రింగురోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాలలో దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజ్యాంగం దినోత్సవంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి కెజి శంకర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి లీలావతి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ సుధాకర్‌బాబు, జేసురత్నం తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని మేడ్ రాష్ట్ర కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం గుంటూరు నగర అధ్యక్షుడు రావెల నల్లయ్య అధ్యక్షతన జరిగాయి. మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వినుకొండ రాజారావు, కొల్లిపర ఆనందరావు, పి.రమేష్, కె.మరియదాసు, వి.సుధాకర్, కె.జయప్రకాశ్, కె.కిషోర్, చిన్నయేసు, డాక్టర్ చిలకా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

● బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం జరిగింది. అంబటి మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావటం లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర అధ్యక్షుడు డైమండ్‌బాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం పలువురు నాయకులున్నారు.

● దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లడి దేవకుమార్ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ డీడీ చుక్క శామ్యూల్ తదితరులున్నారు.

● రాజీవ్‌గాంధీభవన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. మాజీ ఎమ్మెల్యేలు షేక్ మస్తాన్‌వలి, లింగంశెట్టి ఈశ్వరరావు, పార్టీ నాయకులు గడ్డం పాల్‌విజయ్ కుమార్, రాచకొండ జాన్‌బాబు, బిక్కా సునీల్, యన్నం సుధీర్‌బాబు, నరేష్, చంద్రపాల్ తదితరులున్నారు.

● ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ ఆధ్వర్యంలో నల్లపాడురోడ్డులోని సంఘం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నక్కల నాగరాజు, వెంకటరావు, గురుప్రసాద్ తదితరులున్నారు.

● స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్తయ్య పాల్గొన్నారు.

● భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని, దానిని అందరూ గౌరవించాలని గుంటూరు రైల్వే డీఆర్ఎం ఎం రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో రాజ్యాంగ ప్రవేశికతో అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే సైమన్, వివిధ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరంబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బత్తుల వీరబాబు, బేతపూడి భారతి, చిన్న డేవిడ్ విలియమ్స్, నల్లపు నీలంబరం, నేలపూడి దాసు, పిల్లి సాగర్, బి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన గొప్ప వరం రాజ్యాంగం అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, ఏవో శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

● గుంటూరు కార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో వివక్షకు తావులేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలను రాజ్యాంగం ద్వారానే అందుతున్నాయని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, సిబ్బందితో భారత రాజ్యాంగ పీఠికను పఠించారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ రాంబాబు, ఎగ్జామినర్ నాగేంద్ర కుమార్, అసిస్టెంట్ ఎగ్జామినర్ పద్మజ, సిఎంహెచ్ఓ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

● రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి ఐజి సర్వశ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రేంజ్ కార్యాలయంలో ఐజీ కార్యాలయ సిబ్బంది నివాళులర్పించగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ, ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు నివాళులర్పించారు. ఐజీ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ప్రవేశిక భారతదేశంలోని పౌరులందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం ప్రజల మధ్య సోదరభావాన్ని ప్రోత్సహించే విధంగా రూపొందించడం జరిగిందన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగానికి ఆమోదం లభించిన రోజు నవంబరు 26ను ఏటా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ల్లా అదనపు ఎస్పీ భాస్కరరావు, శివకృష్ణ పాల్గొన్నారు.



కేఎల్‌పీ స్కూల్‌లో ప్రమాణం చేస్తున్న విద్యార్థులు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐజి సర్వశ్రేష్ఠత్రిపాఠి

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



ర్యాలీలో పాల్గొన్న కేఎస్ లక్ష్మణరావు, అజయ్‌కుమార్ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ మంగళవారం నగరంలో బీఆర్ స్టేడియం నుంచి మార్కెట్ వరకు భారీ ర్యాలీ, మార్కెట్ సెంటర్లో బహిరంగ సభ నిర్వహించారు. సభకు రైతు సంఘాల నాయకులు కె.అజయ్, పచ్చల శివాజీ, ప్రజా సంఘాల నాయకులు అకిటి అరుణ్‌కుమార్, దండా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని నాశనం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఏపీ రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన పోరాటం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను ఈరోజు వరకు నెరవేర్చలేదని మండిపడ్డారు. ఏ ఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం కార్మికుల, రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి, ఆ వినతిపత్రాన్ని రాష్ట్రపతికి పంపాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, కే.నళినికాంత్, జొన్నా శివశంకర్, వై నేతాజీ, ఈమని అప్పారావు, కొల్లి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుతో కార్మికులకు ప్రయోజనాలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు, అధికారులు

గుంటూరు(తూర్పు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు కార్డుతో కార్మికునికి, వారి కుటుంబాలకు ప్రయోజనాలు సమకూరతాయని సంయుక్త కార్మిక కమిషనర్ శ్రీనివాసకుమార్ అన్నారు. స్థానిక గోరంట్లలో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన యజమానులు సహకరించి కార్మికులకు గుర్తింపు కార్డులు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపకార్మిక కమిషనర్ ఏ.గాయత్రిదేవి, సహాయ కార్మిక కమిషనర్ కేఎం సుభాని, అధికారులు డి.లక్ష్మీ, వి.ప్రసాదరావు, హనుమత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి నెహ్రూనగర్ గేటు వరకు ఆక్రమణల తొలగింపు : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంజీవయ్య నగర్ రైల్వే గేటు నుంచి నెహ్రూనగర్ గేటు వరకు రోడ్డు, డ్రెయిన్ ఆక్రమణలను డిసెంబరు 2వ తేదీ నుంచి తొలగిస్తామని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకొని జీఎంసీకి సహకరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటన లో కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, డ్రెయిన్ల మీద ఆక్రమణల వల్ల పూడిక తీయడటానికి వీల్లేక, మురుగుపారుదలకు ఆటంకంగా ఉండటం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. గుంటూరు నగరం నుంచి మురుగు సముద్రంలోకి వెళ్లే పీకల వాగు మెయిన్ డ్రెయిన్ వేజెండ్ల, సుద్దపల్లి పంట పొలాల్లోకి పొంగ కుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ వేజెండ్ల, సుద్దపల్లి గ్రామాల పరిధిలో పీకలవాగు, సంగం జాగర్లమూడి నుంచి గుంటూరుకి తాగునీటి సరఫరా జరిగే పైప్‌లైన్‌ని పరిశీలించారు. పర్యట నలో ఏసీపీ చంద్రశేఖర్, టీపీఎస్ లక్ష్మణస్వామి, సర్వేయర్ సుభాని, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ జాబితాలు రూపొందించాలి

● రోల్ అబ్జర్వర్ సూర్యకుమారి ఆదేశం

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సమ్మరీ రివిజన్-2025కు సంబంధించి క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తప్పులు లేని ఎలక్టోరల్ రోల్‌ను తయారు చేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా రోల్ అబ్జర్వర్ ఏ.సూర్యకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఎస్ ఆర్-2025పై కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి ఆమె ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. రోల్ అబ్జర్వర్ సూర్యకుమారి మాట్లాడుతూ బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికి సందర్శించి ఆరోగ్యకరమైన ఎలక్టోరల్ రోల్ రూపొందించడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముం దస్తు సమాచారం ఇవ్వడం ద్వారా వారితో సమావేశాలు నిర్వహించాలని ఈఆర్‌వోలకు సూచించారు. ఈ సమావేశంలో గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్-కలెక్టర్ సంజన సింహా, డీఆర్వో షేక్ ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగారాజు, లక్ష్మీకుమారి తదితర అదికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉల్లిపాయలు, వంటనూనెల ధరలు పెరగకుండా చూడాలి : కలెక్టర్




ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ


గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉల్లిపాయలు, వంటనూనెల ధరలు పెరగకుండా ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లిపాయల ధరలు కేజీ రూ.60 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారని, దీని వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని చెప్పారు. అలానే పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్స్ ధరలు కూడా లీటర్ రూ.140 దాటిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో వాటి ధరలకు కళ్లెం వేయాలన్నారు. రైతుబజార్లలో విక్రయిస్తున్న ఉల్లిపాయల నిల్వలు సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. నూనెల ధరలు తగ్గేలా చూడాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ, మార్కెటింగ్ జిల్లా ఏడీ రాజబాబు, ఉద్యానశాఖ అధికారి రవీంద్ర బాబు, డీఏవో నున్న వెంకటేశ్వర్లు, డీఎస్‌వో కోమలి పద్మ, జిల్లా వినియోగదారుల కౌన్సిలర్ ఇన్‌ఛార్జ్ హరిబాబు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

'దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్' యాప్ ఆవిష్కరణ

గుంటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అభియాన్ అనే మొబైల్ యాప్‌ను కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ధన్వంతరి జయంతి నాడు అక్టోబరు 29న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భారతదేశ పౌరులందరికి ఈ యాప్ నెల రోజుల వరకు (నవంబరు 26 నుంచి డిసెంబరు 25వ తేదీ వరకు) అందుబాటులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు అనిత, శోభారాణి, వాణి పాల్గొన్నారు.



ఇలా తగ్గాలి..



- అయోమయంగా వెయిట్ లాస్ పద్ధతి
- ఆహారపు నియమాలు పాటించకపోతే అసలుకే ఎసరు
- బరువు తగ్గినంత మాత్రానా ఆరోగ్యంగా ఉన్నట్టు కాదు
- శరీరంలో కొవ్వు లేకుండా చూసుకోవాలి
- డైట్, వ్యాయామాలతోనే సాధ్యం
- ప్రకటనలపై అప్రమత్తం ఉండాలంటున్న వైద్యులు

ఈమధ్య అందరని వేధిస్తున్న సమస్య అధిక బరువు.. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ ఈ సమస్యతో బాధపడుతున్నారు. కూర్చోని పనిచేయడం, శారీరక శ్రమ అంతగా లేకపోవడం, వ్యాయామంకు దూరమవ్వడం, పోషకాలు లేని ఆహారాన్ని తీసుకోవడం వంటి కారణాలతో ఒబెసీటి బారిన పడతున్నారు. వంశపారపర్యంగా గాకుండా కేవలం మన నిర్లక్ష్యం వల్ల వచ్చేదాన్నే ఒక విధంగా ఓబెసిటీ అనవచ్చు. అటుపై గుండె సంబంధిత, చక్కెర వంటి వ్యాధులు సహజంగానే శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సమస్య అన్ని వయస్సుల వారిని వేధిస్తుంది. అందుకే చాల మంది బరువుతగ్గాలని అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కాస్త తగ్గగానే ఆరోగ్యంగానే ఉన్నట్టు భావిస్తుంటారు. కానీ తగ్గించుకోవాల్సింది బరువు కాదని....శరీరంలోని కొవ్వునని నిపుణులు చెబుతున్నారు.ఈ చిన్న తేడాను గమనించలేక అనేక మంది వెయిట్‌లాస్ విధానాన్ని సరైన మార్గంలో చేయలేకపోతున్నారు. ఇలా చేయడం వల్ల అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషికి శారీరకశ్రమను తగ్గించింది. దీంతో ఎక్కువ మంది వయస్సు, శరీరం నిర్మాణంతో సంబంధం లేకుండా అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ బరువుకు కారణం శరీరంలో పేరుకుపోయిన కొవ్వు నిల్వలే.... తినే ఆహారంలో పిండిపదార్థాలు, కార్బోహైడ్రేట్లు, ఎక్కువ సార్లు రీఫైనరి చేసిన పదార్థాలు ఉండటమే దీనికి కారణం. అంతేగాక బరువును తగ్గించుకునే క్రమంలో ఆహారపు అలవాట్లను కూడా మార్చుకోరు. దీంతో ఇతర అనారోగ్య సమస్యలను కూడా కొని తెచ్చుకుంటారు. అసలు బరువు తగ్గడం అంటే ఏంటి అనే విషయంపై చాలమందికి అవగాహన ఉండదు. అందుకే బరువును తగ్గిస్తాం అనే ప్రకటనలు చూసి మోసపోతుంటారు. మరి కొంత మంది వ్యాయామం, వాకింగ్ వంటివి చేసి ఆహారపు నియమాలను పాటించరు. వీటి వల్ల తాత్కాలిక ప్రయోజనం ఉంటుంది కాని శాశ్వత పరిష్కారం లభించదని నిపుణులు తెలుపుతున్నారు. వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకున్నప్పుడే ప్రయోజనాలు ఉంటాయని సూచిస్తున్నారు.

డైట్ నియమాలు పాటించాలి

అధిక బరువుతో బాధపడుతున్నవారు ఆహారపు నియమాలను తప్పనిసరిగా పాటించాలి అప్పుడే శరీరంలో ఉన్న కొవ్వును తగ్గించుకోగలుగుతాం. పిండిపదార్థాలు, కార్బోహైడ్రేట్లు, పిల్లలు అయితే జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇది మొత్తం పొట్ట, ఇతర భాగాల్లో పేరుకుపోతుంది. ఇటువంటి కొవ్వును కరిగించా లంటే ప్రొటీన్ ఉన్న ఆహారంతోనే సాధ్యమవుతుంది. దీనినే ప్రొటీన్ డైట్ అని కూడా అంటారు. దీని వల్ల కొవ్వు తగ్గడంతో పాటు, శరీరంలో మజిల్స్ పవర్ (కండరాల శక్తి) శాతంకూడా పెరుగుతుంది. అసలు 80 శాతం డైట్, 20 శాతం వ్యాయామం ఉంటే శరీరంలో కొవ్వును తగ్గించుకోవచ్చుని నిపుణులు సూచిస్తున్నారు.



వర్కవుట్ల తర్వాత ఇవి తినండి...

వర్కవుట్ సెషన్ తరువాత స్వల్పకాలవ్యవధిని అనబాలిక్ విండ్‌గా పిలుస్తారు. ఈ సమయంలో వ్యాయామం చేసిన వ్యక్తి కండరాల ఎదుగుదలకు రికవరీకి ప్రొటీన్ ఫుడ్ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వర్కవుట్స్ సమయంలో కండరాలు చాలా సున్నితంగా మారతాయి. కొన్నిసార్లు నొప్పిని కూడా కలిగిస్తాయి. ప్రొటీన్లు కలిగిన ఆహారం తింటే కండరాలు శక్తిని పుంజుకుంటాయి.

ఏదో ఒక డైట్ మాత్రమే పాటించాలి

సాధారణంగా వెయిట్‌లాస్ అవ్వాలనుకునే వారు పొలియో డైట్, వేగన్‌డైట్, లో కార్బోడైట్, డ్యూకెన్‌డైట్, అల్ట్రా లో ఫ్యాట్ డైట్, అదికిన్స్‌డైట్, ఇంటర్ మిటెంట్ ఫాస్టింగ్ జోన్, హెచ్‌సీజీ తో పాటు కొన్ని రకాల ప్రొటీన్ డైట్లు పాటిస్తుంటారు. కానీ వీటిలో ఏదో ఒకదానిని మాత్రమే పాటించాలి. అలాగే రోజులో మూడుసార్లు తినే ఆహారాన్ని 5 నుంచి 6 సార్లు తీసుకునేలా చుసుకోవాలి. పిల్స్, ట్యాబెట్స్ ద్వారా బరువు తగ్గించే కొన్ని డైట్‌లు కూడా ఉన్నాయి. అటువంటి వాటికి దూరంగా ఉంటే మంచిది.

ప్రొటీన్ ఏయే పదార్థాల్లో ఉంటుంది

మొలకెత్తిన గింజలు, పొట్టు తీయని పదార్థాలుతో పాటు, చేప, గుడ్లు, చికెన్ వంటి పదార్థాలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. మనిషి సగటు బరువు ఎంత ఉందో అన్ని గ్రాములు ప్రొటీన్ తీసుకుంటే మంచిది, ఉదాహరణకు 50 కేజీలు ఉన్న మనిషి రోజుకు 50 గ్రాముల ప్రొటీన్ శరీరానికి అందేలా చూసుకోవాలి. అలాగే ఆహారాన్ని ఒకేసారి కాకుండా రోజులో ఎక్కువ సార్లు తీసుకోవాలి. అంతేగాక ఒక రోజుకు మనిషికి 2000 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారం అవసరమవుతుంది అనుకుంటే, కేవలం 1500 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. మిగిలిన అవసరమైన క్యాలరీలను శరీరంలో ఉండే కొవ్వును కరిగించి శక్తిగా మారేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ అవసరానికి మించి క్యాలరీలను తీసుకోంటే అది కొవ్వుగా మారిపోతుంది. అంతేగాక రోజులో చక్కెర పరిమాణం 4నుంచి 5 శాతం మాత్రమే తీసుకోవాలి.

తగ్గుతోంది ఏంటి ?

చాలా మంది రెండు వారాల వ్యాయామం, ఇతర చికిత్సల తరువాత 2-5 కేజీల బరువు తగ్గినట్టు కన్పిస్తారు. వాస్తవానికి ఇలా తగ్గేది కొవ్వు కాదు. శరీరంలో ఉన్న నీటిశాతం, మజిల్స్ కరగడం వల్ల ఇలా బరువు తగ్గినట్టు కన్పిస్తారు. డైట్ పాటించకుండా, వెయిట్‌లాస్‌లో సరైన విధానాలు పాటించని వారిలో ఇటువంటి లక్షణాలు కన్పిస్తాయి. ఇటువంటి విధానాలనే కొనసాగిస్తే శరీరంలో కొవ్వు అలానే ఉండి, కండరాలు కరిగి చర్మం లూజుగా మారిపోతుంది. నీటి శాతం తగ్గడం వల్ల స్పృహ తప్పడం, క్లోమ గ్రంధి పనిచేయకపోవడం వల్ల చక్కెర వ్యాధితో పాటు, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదముంటుంది. కండరాలు బలహీనమై ఒకోసారి పక్షవాతంకు దారీతీసే అవకాశం లేకపోలేదు.

వ్యాయామాలు చేయాలి ?

అధిక బరువుఉన్న చాలా మంది కార్డియో వర్కవుట్‌లు చేస్తూంటారు. కానీ దీనితో పాటుగా మజిల్స్ వర్క్‌వుట్ కూడా చేయాలి. అప్పుడే గుండెతో పాటు ఇతర అవయవాలు క్రియా శీలకంగా పనిచేస్తాయి. రోజులో 60 నిమిషాలు తప్పనిసరిగా వ్యాయమం చేయాలి. కండరాలకు వ్యాయామం చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం. చేతులు, కాళ్లు, పొట్ట వర్క్ అవుట్‌లు చేసే సమయంలో విడి, విడిగా చేయాలి. అన్ని ఒకేసారీ చేయాలనుకుంటే మజిల్స్ స్ట్రక్ అయ్యే ప్రమాదముంటుంది. అలాగే నడకకు సంబంధించి 7నుంచి 10 వేలు అడుగులు తక్కువగాకుండా చూసుకోవాలి.



కొవ్వు శాతం ఎలా తెలుస్తుంది ?

ఎక్కువ మంది తమ బరువును తెలుసుకోనే ప్రయత్నం చేస్తూంటారు. కానీ అధిక బరువుతో బాధపడేవారు శరీరంలోని కొవ్వు శాతాన్ని మాత్రమే తెలుసుకోవాలి. బాడీ మాస్ ఇండెక్స్ అనే పరికరం ద్వారా దీనిని తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఇది అన్ని షాపింగ్ మాల్స్, ఆస్పత్రిల్లో అందుబాటులో ఉంది. శరీరంలో 28శాతం లోపు కొవ్వు ఉంటే సాధారణంగా ఉన్నట్టుగా పరిగణిస్తారు. 28-30 వరకు ఉంటే ఓవర్ వెయిట్ అని, 30 -35 ఉంటే ఓబెసిటీ అని, 35కంటే అధికంగా ఉంటే ఓవర్ ఓబెసీటి గా పరిగణిస్తారు.



80 శాతం డైట్.. 20 శాతం జిమ్

చందు, ఫిట్‌నెస్ ట్రైనర్, న్యూట్రిషియన్ - గుంటూరు



జిమ్‌కు వస్తే బరువు తగ్గుతాము అనేది అపోహ మాత్రమే. జిమ్‌తో పాటు మంచి ఆహారం ముఖ్యం. 80శాతం ఆహార నియమాలు పాటిస్తేనే కొవ్వును తగ్గించుకోగలుతాం. మిగిలిన 20 శాతం వ్యాయామం చేస్తే సరిపోతుంది. ఈ మధ్యకాలంలో పిల్లలు కూడా ఒబెసిటీ బారిన పడుతున్నారు. ఆహారంలో సమతుల్యత లేకపోవడమే దీనికి కారణం. అధిక బరువు ఉన్నవారు ప్రత్యేకమైన వ్యాయామాలను చేయాలి.

పౌడర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

భువన, డైటీషియన్



కొవ్వు తగ్గించడానికి మార్కెట్‌లో లభ్యమయ్యే పౌడర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వీటితో దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. పౌడర్ల వాడే ముందు వైద్యులను సంప్రదించాలి. ఉదయాన్నే వెన్నతీసిన పాలు, పచ్చసొన తీసివేసిన గుడ్లు తీసుకోవాలి. గింజధాన్యాలు, పప్పుదినుసులు, చిక్కుడు గింజలు వంటి వాటిలో అధికంగా మాంసకృత్తులు ఉంటాయి. ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. గింజధాన్యాలు పొట్టు తీసుకోకుండా తినాలి. వీటితో పాటు ఉడకబెట్టిన కూరగాయలు తీసుకోవాలి.

మామూళ్లు.. ఓవర్ లోడ్

(5వ పేజీ తరువాయి)

టిప్పర్ల నుంచి రూ. 2 కోట్లకు పైగా అక్రమ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ బలవంతపు వసూళ్ల నుంచి ఎలా బయట పడాలో అర్థంకాక బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడిగినంతా చెల్లిస్తే కేసులుండవు ..

ఎవరైతే అడిగినంతా ఇవ్వకుంటే వెంటాడి మరీ కేసులు నమోదు చేస్తూ భారీగా జరిమానాలు విధిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.టిప్పర్‌కు అనుమతించిన వాహన బరువు 10టన్నులు కాగా దానిలో 18 టన్నుల వరకు సరుకు రవాణా చేయవచ్చు. అందుకు భిన్నంగా ఆధునిక ఫీచర్లతో వచ్చిన లారీల బరువే 11 టన్నులకు పైగా ఉంటుంది. వాటిలో 30 నుంచి 35 టన్నుల వరకు ఇసుక.. కంకర వంటి మెటీరియల్‌ను రవాణా చేయగలుగుతున్నారు. రహదారుల భద్రత దృష్ట్యా ఓవర్‌లోడ్ నిబంధనలు తెచ్చినా అవి అమలు కావడం లేదు. టిప్పర్లకు జీపీఎస్ సౌకర్యం ఉండడంతో, ముడుపులు ఇవ్వని టిప్పర్లు ఎక్కడ తిరుగుతున్నాయో తెలిసి పోతుండడంతో, ఆ వాహనాలను గుర్తించి కేసులు, జరిమానాలు విధిస్తున్నారని, తప్పనిసరి పరిస్థితిలో ముడుపులు సమర్పించుకుంటున్నామని వాహనదారులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీలు రిపేరుకు వచ్చినా, పనులు లేక కొన్ని రోజులు తిప్పకపోయినా అధికారులు కనికరించడం లేదని యాజమానులు వాపోతున్నారు.

మధ్యవర్తుల హవా..

రవాణా శాఖలో కొందరు చేస్తున్న అక్రమ వసూళ్లలో మధ్యవర్తుల హవా కొనసాగుతోంది. ప్రతి నెల 5వ తేదీ లోపు ముడుపులు చెల్లించాల్సిందే. లేదంటే వెంటనే కేసులు నమోదు అవుతాయి. తమ వద్ద పనిచేస్తున్న కానిస్టేబుళ్లను పురమాయించి, టిప్పర్ యాజమానులలో ఇద్దరు ముగ్గురిని ఎంపిక చేసుకొని వారి ద్వారా మిగతా వారి నుంచి నెలవారీ ముడుపులు వసూలు చేస్తున్నారని తెలిసింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో బరితెగించిన కొందరు అధికారులే, కూటమి ప్రభుత్వంలోనూ వసూళ్ళ వ్యవహారం చక్కబెడుతున్నారని లారీల యాజమానులు వివరిస్తున్నారు.

సూర్యలంక తీరంలో బీచ్ వాలీబాల్ పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన, కలెక్టరు
- 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరు

బాపట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలు యువతలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 68వ అంతర్‌జిల్లాల బీచ్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఎమ్మెల్యే జాతీయ జెండాను ఆవిష్కరించారు. క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వాలీబాల్ బంతిని సర్వీస్ చేసి ప్రారంభించారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ముప్పాయపాలెం పాఠశాల విద్యార్థినీలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రారంభ సభలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలు శరీర ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతాయన్నారు. యువత ఆరోగ్యం మెరుగు పడటంతోపాటు, క్రీడా నైపుణ్యాలను మెరుగు దిద్దుకోవటానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. టీమ్‌గా పనిచేయటానికి స్ఫూర్తిని నింపుతాయన్నారు. సముద్ర తీరం వెంబడి మంచి ఏర్పాట్లతో పోటీలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. పోటీలలో పాల్గొనేందుకు 13జిల్లాలు నుంచి క్రీడాకారులు రావటం జరిగిందన్నారు. కార్తీకమాసంలో ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయటం శుభపరిణామమని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో అంతర్ జిల్లాల పోటీలు నిర్వహించటం సంతోషదాయకమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. అన్నిజిల్లాల క్రీడాకారులు బాపట్లకు వచ్చి బీచ్‌వాలీబాల్ పోటీలలో పాల్గొనటం మంచి పరిణామమన్నారు.సూర్యలంక బీచ్‌ని పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. కార్తీక మాసంలో సూర్యలంక బీచ్‌లో లక్షల మంది ప్రజలు స్నానాలు ఆచరించటం, పూజలు చేయటం జరుగుతుందన్నారు. గెలుపు, ఓటమీలను ఒకేలాగా స్వీకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం చెప్పారు. ఓటమ పాలైన వారు ఛాలెంజ్‌గా తీసుకొని మరోమారు గెలుపునకు కృషి చేయాలన్నారు. విజేతలైనవారు ఒడిస్సాలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని బహుమతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా స్పోర్ట్స్ అధారటి చీఫ్ కోచ్ కె.పాల్‌కుమార్, అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి, షేక్.కరీముల్లా, టీడీపీ మహిళా నాయకులు కాగిత నాగభూషణమ్మ, దగ్గుమల్లి రాణి, ఎంఇవో డి.ప్రసాదరావు పాల్గొన్నారు.



క్రీడాకారులు నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే అధికారులు

ఆమె.. ఆదర్శం

- తన పిల్లలను ప్రభుత్వ స్కూల్లో చేర్పించిన ఉపాధ్యాయురాలు
- అభినందించిన రెడ్డిగూడెం గ్రామస్థులు, అధికారులు



ఉపాధ్యాయురాలు సుజాతలక్ష్మీని శాలువాతో సత్కరిస్తున్న గ్రామస్థులు, అధికారులు

రాజుపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంపన్నులు, ఆర్థికంగా కాస్త ఇబ్బందికరంగా లేని వారు ఎవరూ కూడా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించేందుకు ముందుకు రాకపోవటం చూస్తున్నాం. దాదాపుగా ప్రభుత్వ ఉద్యోగులందరూ ఇదే కోవకు చెందిన వారే. కానీ వీరందరికీ భిన్నంగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆమె పిల్లలను ఆమె విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. ఇలా ఇతరుల పిల్లలతో పాటు ఆమె పిల్లలకి తానే విద్యాబుద్ధులు చెబుతూ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులుగా నిలిచారు.

వివరాలలోకి వెళితే.. రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బిత్రా సుజాతలక్ష్మీ అనే ఉపాధ్యాయురాలు నాలుగు సంవత్సరాల నుంచి విద్యాబోధన చేస్తున్నారు. అదే పాఠశాలలో రెండు సంవత్సరాల క్రితం తన పెద్ద కుమార్తె విశ్వజ్ఞను నాలుగవ తరగతిలో చేర్పించింది. రెండవ కుమార్తె కృష్ణజను ఒకటవ తరగతిలో చేర్పించింది. ఆరోజు నుంచి నేటి వరకు సుజాతలక్ష్మీ తన ఇద్దరి పిల్లలను తీసుకుని పాఠశాలకు వస్తుంది. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ పది నిమిషాల ముందే పాఠశాలకు చేరుకుంటుంది. ఈ విషయం గమనించిన గ్రామస్థులు భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం రోజున ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈవో మల్లికార్జున శర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, నల్లమోతుల శ్రీనివాసరావు(వాసు), షేక్ అల్లాబక్షు తదితరులు ఉపాధ్యాయురాలును అభినందించారు. ఈ సందర్భంగా సుజాతలక్ష్మీ మాట్లాడుతూ 'నా పిల్లలు కూడా ఇక్కడ చదువుకోవటం వలన ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం ఉంది. దాంతో నేను సాయంత్రం ఇంటికి ప్రశాంతంగా, సంతృప్తికరంగా వెళ్తున్నాను' అని చెప్పటంతో అక్కడ ఉన్న వారంతా ఆమెను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పోటీతత్వం కన్నా క్రీడా స్ఫూర్తి గొప్పది

- వీసీ ఆచార్య గంగాధరరావు
- ఏఎన్‌యూలో ప్రారంభమైన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య కే గంగాధర్

పెదకాకాని, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పోటీ తత్వంకన్నా క్రీడ స్ఫూర్తి ఎంతో గొప్పదని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయలం (ఏఎన్‌యూ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్యా విభాగం ఆధ్వర్యంలో సౌత్- వెస్ట్ జోన్ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం అట్ట హాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రీడలకు ఉన్న ప్రాధాన్యత మరే రంగంలో కూడా ఉండదని అన్నారు. దేశ భవిష్యత్తును, వ్యక్తిగత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు రాణించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ లక్ష్య సాదన కోసం నిరంతరం శ్రమించాలని, అదే వారిని విజేతలుగా నిలుపుతుందని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడలకు పుట్టి నిల్లుగా నిలుస్తోందని, ఇటువంటి ఆహ్లాదకర వాతావరణంలో క్రీడలను ఆస్వాదిస్తూ క్రీడాకారులు మంచి ప్రదర్శనలు ఇవ్వాలని అన్నారు. రెక్టర్ ఆచార్య కే రత్న షీలామణి మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ,శారీరక దృఢత్వంతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జీ సింహాచలం మాట్లాడుతూ మహిళలు వెయిట్ లిఫ్టింగ్ లో రాణించడం గొప్ప విషయమని అన్నారు. వారిని ప్రోత్సహిస్తున్న వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియ జేశారు. భవిష్యత్తులో కూడా అనుకున్న లక్ష్యాలు సాధించాలని సూచిం చారు. క్రీడల నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ పిపిఎస్ పాల్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఈ క్రీడల్లో ఎటువంటి ఇబ్బందులు ఉండవని ప్రతిభ ఉన్న వారికే పథకాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం తొలి రోజు పోటీలలో పతకాలు సాధించిన మహిళా వెయిట్ లిఫ్టర్లకు మెడల్స్ ను అందజేశారు. ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య టెక్నికల్ కమిటీకి చీఫ్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో వ్యాయామ కళా శాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పీ జాన్సన్, అధ్యాపకులు డాక్టర్ యిన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు, డాక్టర్ డీసూర్యనారాయణ పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీలో క్రీడాకారిణుల ప్రదర్శన

మహిళా విభాగంలో తొలి రోజు ఫలితాలు

సౌత్ వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ మహిళల విభాగం 45 కేజీల విభాగంలో శివాజీ యూనివర్సిటీ (కొల్హాపూర్) క్రీడాకారిణి సర్గార్ కాజోల్ మహదేవ్ బంగారు పతకం, మంగళూరు యూనివర్సిటీకి చెందిన స్పందన వెండి పతకం, యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఆర్. గోగోయి కాంస్యపతకం సాధించారు. 49 కేజీల విభాగంలో.. ముంబై యూనివర్సిటీకి చెందిన సౌమ్య దాల్వి బంగారు పతకం, గుజరాత్ లోని జైన్ యూనివర్సిటీ క్రీడాకారిని తోక్చోం సంజు దేవి వెండి పతకం, కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ క్రీడాకారిణి ఎన్.అను కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. 55 కేజీల విభాగంలో.. శ్రీకాకుళంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ క్రీడాకారిణి దూబా హేమశ్రీ బంగారు పతకం పొందగా గుజరాత్ లోని మార్వాడి యూనివర్సిటీ క్రీడాకారిని శర్మ విద్య వెండి పతకం, శివాజీ యూనివర్సిటీ కి చెందిన క్రీడాకారిని కమలాకర్ నికిత సునీల్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకున్నారు.

పశ్చిమడెల్టా కాల్వకు 3007 క్యూసెక్కులు..

దుగ్గిరాల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ప్రకాశంబ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 3007 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 186క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 142, తూర్పుకాల్వకు 52, పశ్చిమ కాల్వకు72, నిజాంపట్నంకాల్వకు218, కొమ్మమూరుకాల్వకు 1800 కూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంగళగిరి సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి తెనాలి రోడ్డులోని అక్షయపాత్ర సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా (50) మంగళగిరిలో సెంట్రింగ్ పని చేసుకుని తిరిగి ఇంటికి చేరుకునే సమయంలో అక్షయపాత్ర వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

29న చైతన్య తపోవన్‌లో

గుండె వైద్యశిబిరం

తాడేపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం నులకపేటలోని చైతన్య తపోవన్‌లో ఈ నెల 29న విజయవాడ పీవీఆర్ మల్టీ స్పెషాలిటి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్స్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్ శర్మ ఓ ప్రకటనలో తెలిపారు. ఈసీజీ, ఎకో వంటి కీలక పరీక్షలు చేయించి ఉచితంగా మందులిస్తామన్నారు. గుండెతోపాటు కీళ్ల మెదడు, నరాలు, కిడ్నీలు ఈఎన్‌టి, ఎముకలు, గైనిక్ సమస్యలపై కూడా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందని ఆయా విభాగాలలో స్పెషలిస్టు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తారని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని తాడేపల్లి మండల వాసులు వినియోగించుకోవాలని రజనీకాంత్ శర్మ కోరారు.

విజ్ఞాన మేళాలో

నూతక్కి విద్యార్థుల ప్రతిభ


మంగళగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత శిక్షా సంస్థాన్ ఆధ్వర్యాన ఒడిశాలో జరిగిన గణిత మేళా, సంస్కృతి మహోత్సవంలో మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలోని విజ్ఞాన విహార పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబర్చారు. 8వ తరగతి విద్యార్థిని జీ.ఉర్విశ్రీ 'సర్ఫేస్ ఏరియా అండ్ వాల్యూమ్స్' అనే అంశంపై రూపొందించిన నమూనాకు బాలవర్గ ప్రథమ స్థానం, పదవ తరగతి విద్యార్థిని డి.చరిత క్షేత్ర గణితంలో కిషోర వర్గ తృతీయ స్థానం సాధించారు. వీరిని పాఠశాల కార్యదర్శి వేణుగోపాల నాయుడు, ప్రధానాచార్యులు వెనిగళ్ల సురేష్, సహ ప్రధానాచార్యులు సీహెచ్ రామమూర్తి, డి.సౌజన్య, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

దత్తు సేవలు చిరస్మరణీయం

మంగళగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి పీసీసీ మాజీ సభ్యుడు రంగిశెట్టి విజయదత్తు చిరస్మరణీయమైన సేవలందించారని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. దత్తు 18వ వర్ధంతిని పురస్కరించుకుని మాజీ కౌన్సిలరు రంగిశెట్టి నరేంద్ర (బాబీ) ఆధ్వర్యంలో ఎంటీఎంసీ కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దత్తు రాజకీయాలపై మక్కువ పెంచుకుని యువతను సమీకరించి జైఆంధ్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. నేటి తరం యువ నేతలు దత్తును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుఖమంచి గిరిబాబు, తాడిగిరి సుధీర్, సైనాథం శ్రీనివాసరావు, రంగిశెట్టి శ్రావణ్, కల్యాణ్, బాణాల సాయి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడిని తగ్గించండి

వట్టిచెరుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వాహణలో పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి రమేష్ బాబుకు మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు వినతిపత్రాన్ని అందజేశారు. వివిధ రకాల నాన్ టెక్నికల్ పనులు మాకు అప్పగించటం వల్ల పని ఒత్తిడి పెరుగుతుందని, ప్రస్తుతం పల్లె పండుగ, ఎన్ఆర్‌జీఎస్, సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం, అంగన్ వాడీల సౌకర్యాల కల్పనకు పనులు, హౌసింగ్ నిర్మాణ పనుల టార్గెట్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. హౌసింగ్ జియో ట్యాగ్, ఇతర పనులను చేస్తూనే బీఎల్‌వోల విధులు కూడా నిర్వహిస్తున్నామని, మాకు సెలవు దినాలు లేకుండా పోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ వినతి పత్రం ఇస్తున్నట్టు వారు తెలిపారు. ఏఎస్ఈ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



దేశానికి దిక్సూచి.. రాజ్యాంగం

- కుల,మతాలకు అతీతంగా రూపకల్పన
- 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో వక్తలు
- జిల్లాలో ఘనంగా వేడుకలు



ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ శారద జయలక్ష్మీ, విశ్వవిద్యాలయం అధికారులు

తాడికొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం దేశానికి దిక్సూచి అని, కులాలు, మతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీ దేవి అన్నారు. మంగళవారం 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకొని లాం ఫాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాజ్యాంగంలో వ్యక్తి స్వేచ్ఛ ఎంతో ప్రాధాన్యముందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకోసం పునరంకితం కావాలని కోరారు. భారత రాజ్యాంగ నిర్మాత, సభ్యులకి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విశ్వవిద్యాలయం ఉద్యోగులందరిచే మన రాజ్యాయంగ పీఠికలోని అంశాలపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జీ. రామచంద్రరావు, డాక్టర్ ఏ.మణి, డాక్టర్ బీ. శ్రీలక్ష్మీ, డాక్టర్ జీ.శివనారాయణ, డాక్టర్ డీ.సంపత్ కుమార్, డాక్టర్ బీ.వీ.ఎస్ ప్రసాద్, డాక్టర్ పీ.రవి, బోధనేతర, బోధన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండ (ఆంధ్రజ్యోతి): తాడికొండ రావిచెట్టు సెంటర్‌లోని ఎంపీయూపీ(నార్త్) స్కూల్లో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నూతక్కి ప్రమీల విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. తాడికొండలోని శ్రీవెల్లంకి వెంకటప్పయ్య ఉన్నత పాఠశాలలో అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీచేశారు. తాడికొండలోని పాఠశాలు, ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీ, ఎంపీడీవో కార్యాలయాల్లో అధికారులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళుర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిల్పా తదితరులు పాల్గొన్నారు.

మేడికొండూరు (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తోట చందన ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పూర్ణశంకరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాలల్లో 75వ రాజ్యాంగ అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను (ఆంధ్రజ్యోతి) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమలో తహసీల్దారు వెంకటస్వామి పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యక్తత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో యుగకీర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో అధికారులు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాత సినిమా హాల్ సెంటర్ వద అంబేడ్కర్ విగ్రహానికి ఎంఈవో కే.ఎఫ్. కెన్నడీ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

తాడేపల్లి (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని జడ్పీ హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ఇన్‌చార్జి హెచ్‌ఎం పీ.బుజ్జిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించి ప్రతిజ్ఞ చేయించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అబద్దయ్య

చిలువూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

దుగ్గిరాల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చిలువూరులోని రైతుసేవాకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ పద్మశాలీయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య మంగళవారం ప్రారంభించారు. పంటనమోదు చేసుకున్న రైతులందరూ 17 శాతం తేమ మించకుండా ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రాలకు తెచ్చుకోవాలన్నారు. ధాన్యం సాధారణరకం క్వింటాల్‌కు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర రూ. 2300, గ్రేడ్ ఏ రకం రూ. 2,320 లకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, జలాలుద్దీన్, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, తోటకూర సీతారామయ్యఎంపీటీసీ మరియరోజమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, పెదపాలెం సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఎత్తివేయాలి

- రోడ్డుపై బైఠాయించి గ్రామస్థులు, మహిళల ఆందోళన

దుగ్గిరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చినపాలెం అడ్డరోడ్డువద్ద ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలంటూ గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. కొద్దిరోజుల క్రితం అడ్డరోడ్డు సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుసుకున్న చినపాలెం గ్రామస్థులు బస్‌షెల్టర్ సమీపంలో ఆందోళన చేపట్టారు. బస్సు దిగి మహిళలు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఇదే మార్గంలో వెళ్లాల్సివుందని, గతంలోనూ మహిళల మెడలో గొలుసులు లాక్కెళ్లిన సంఘటనలున్నాయని, మద్యం దుకాణం ఏర్పాటు యోచన విరమించుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా రెండు రోజుల క్రితం బస్‌స్టాండ్‌కు కొంచెం దూరంలో చినపాలెం అడ్డరోడ్డులో మద్యందుకాణం తెరిచారు. మంగళవారం ఉదయం చినపాలెం గ్రామంలోకి వస్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్‌ను ఆపి ఇటురావద్దని మందుబాబులు హెచ్చరించారని, బస్‌షెల్టర్‌లోనే కూర్చుని మందుతాగుతూ, భయ భ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గంటకు మహిళల ఆందోళనతో అటుగా వెళ్లే గొడవర్రు ఆర్టీసీబస్సు, ఇసుకలారీలు, ఇతర వాహనాలు రెండువైపులా నిలిచిపోయాయి. కొందరు వాహనదారులు పోలీసులకు ఫోన్‌చేయడంతో ఘటనాస్థలానికి చేరుకుని మహిళలను ప్రక్కకు పంపారు. ఐనప్పటికీ మహిళలు ఆందోళన విరమించకుండా మద్యం దుకాణం తెరిచేందుకు వీలులేదంటూ ఆందోళనకుదిగారు. ఇప్పటికైనా అధికారులు మద్యం దుకాణం తరలించడం లేదా ఎత్తివేయటం చేయకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలిసుకున్న తహసీల్దార్ వీఆర్వోను పంపి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పటంతో ఆందోళన విరమించారు.

విద్యుత్ అదాలత్‌లో

15 ఫిర్యాదులు స్వీకరణ

మంగళగిరిసిటీ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల అదాలత్‌ను నిర్వహించారు. సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్ హాజరై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వినియోగదారుల నుంచి 15 ఫిర్యాదులు అందగా, వాటిలో 12 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించారు. మూడు ఫిర్యాదులను తగు సూచనలు చేసి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ అదాలత్‌లో విద్యుత్ శాఖ అమరావతి కార్యనిర్వాహక ఇంజనీరు జే.సంజీవరావు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



మానవ హారంగా నిలుచున్న ఏసీసీ కార్మికులు

మానవ హారంగా

ఏసీసీ కార్మికుల నిరసన

తాడేపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత 30 రోజులుగా సిమెంటు కంపెనీ కార్మికులు తమకు రావలసిన నష్టపరిహారం కోసం వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అందులోభాగంగా మంగళవారం కార్మికులు నిరసన శిబిరం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు వేముల దుర్గారావు, కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, యెహోషువ, రమాదేవి, సాంబయ్య, అంకయ్య, శారమ్మ, నాగేశ్వరరావు, దుర్గాభవాని పాల్గొన్నారు.

లౌడ్ స్పీకర్లు స్వాధీనం

దుగ్గిరాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో లౌడ్‌స్పీకర్లతో తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్న ఆటోలు, ట్రాక్టర్‌లను తనిఖీ చేశారు. పలుమార్లు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో మంగళవారం ఎస్ఐ ఎస్. వెంకటరవి, తమ సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వివిధ వాహనాల్లో ఏర్పాటు చేసిన లౌడ్ స్పీకర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పింఛన్ పునరుద్ధరణపై

సీఎం, ఎమ్మెల్యేకి ధన్యవాదాలు

తుళ్లూరు,నవంబరు 26: (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోనిహైకోర్టు, రాష్ట్ర సచివాలయం, రాజధాని గ్రామాల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన భూమిలేని నిరుపేదల అమరావతి జీవన భృతి ఫింఛన్‌ను గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలో ఈ విషయాన్ని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన చంద్రబాబు వారి ఫించన్‌ను పునరుద్ధరిస్తామని హామీ నిచ్చారు. దీంతో చిరుద్యోగులు, పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మంత్రులు నారాయణ, లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

తాడేపల్లి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం శుభం కళ్యాణ మండపంలో మంగళవారం అమరావతి కంటి ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ వేణు నాదెళ్ల, డాక్టర్ శైలజ కేతినేని ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజర్ స్వరూప్ మాట్లాడుతూ నేత్ర వైద్య నిపుణుల ఆధ్వర్యంలో కొంతమందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఆపరేషన్ చేస్తామన్నారు. మళ్లీ 29వ తేది ఇక్కడే వైద్యశిబిరం నిర్వహిస్తామని, తాడేపల్లి ప్రాంతప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది భువన, జ్యోతి, అనీల, సతీష్, టీడీపీ నేత గోపినాథ్ పాల్గొన్నారు.

పంటబీమా నమోదు చేసుకోవాలి

పెదనందిపాడు, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంట బీమా నమోదు చేసుకోవాలని ఏవో బీ.సుధారాణి అన్నారు. మండల పరిధిలోని గోగులమూడి, రావిపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి, ఉద్యాన సహాయకురాలు షేక్ జరీనా, నజీరా, సిబ్బంది పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రితో ప్రజలకు మేలు

- ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నేతలు

మంగళగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో నిర్మించబోయే వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రితో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, వంద పడకల ఆస్పత్రి సాధన కమిటీ కన్వీనర్ డాక్టర్ మాజేటి వంశీకృష్ణలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా నిర్మించడానికి కృషిచేసిన రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను డిసెంబర్ మొదటి వారంలో సన్మానిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీకి సత్వరమే క్యాబినెట్ ఆమోదం, నిధుల కేటాయింపు, పోస్టుల మంజూరు వంటి కీలకమైన అంశాలను త్వరితగతిన కార్యరూపంలోకి తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవలే మంత్రి లోకేశ్‌ను కలిసి వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులపై చర్చించి, తమ వద్ద వున్న ప్రణాళికలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్టు వివరించారు. డీఎంఈ పరిధి నుంచి మంగళగిరి ఆసుపత్రిని మార్చడానికి ఎన్నో సంవత్సరాలుగా ప్రయత్నించినప్పటికీ ఫలించలేదన్నారు. మంత్రి లోకేశ్ చొరవతో 40రోజుల్లో ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌లోకి మార్చడం జరిగిందన్నారు. వంద పడకల సమగ్ర ఆసుపత్రి నిర్మాణానికి ప్రజలు సహాయ సహకారాలను అందించాలని కోరారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నేతలు

చేనేత సమస్యలపై మంత్రి లోకేశ్‌కు వినతి

తాడేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు 17 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం ఉండవల్లిలో అందజేశారు. రాష్ట్ర చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దకాలంగా చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారం కాక చేతినిండా పని లేక ఉపాధిని కోల్పోయి, అప్పుల ఊబిలో కూరుకుపోతూ ఆకలి చావులకు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరేళ్లకు పైగా చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావల్సిన రూ.172 కోట్ల బకాయిలు రాకపోవడంతో సహకార సంఘాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కార్మికులకు పని చూపలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. చేనేత సహకార సంఘాలకు తక్షణమే పాలక వర్గ ఎన్నికలు జరిపించి సంఘాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. చేనేత కార్మికుల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని నేతన్న నేస్తాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి ఒక్క కార్మికుడితోపాటు చేనేత ఉపవృత్తులవారికి వర్తింపజేయాలని కోరారు. ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్ ఏర్పాటుచేయాలని ఆదరణ పథకాన్ని పునరుద్దరించాలనే తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని లోకేశ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.కన్నయ్య, సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు, మంగళగిరి మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిన్నలింగాయపాలెంలో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జేసీ భార్గవతేజ

రైతులకు అందుబాటులో ఉండాలి

- జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవతేజ

కాకుమాను, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని జాయింట్ కలెక్టర్ ఏ. భార్గవతేజ ఆదేశించారు. మండల పరిధిలోని చిన్నలింగాయపాలెంలో ధాన్యం రాశులను, రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం రాశులను పరిశీలించి తేమ శాతం తక్కువగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించడం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకి లభిస్తుందన్నారు. ధాన్యం విక్రయం అనంతరం నగదు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ అవుతుందన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లయి డీఎం జీ.లక్ష్మీతో కలసి సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఏవో కిరణ్మయి, వీఏఏ హేమంత్, షణ్ముఖ క్షేత్రపాల్, శివ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

పెదనందిపాడు, నవంబరు, 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శంకరబాబు అధికారులను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల్లో భూ రీసర్వేలో అవకతవకలకు సంబంధించి 550 అర్జీలు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు తగు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కరిముల్లా, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సాహితీమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.



తాడికొండ అడ్డరోడ్డులో ఆటో పేపర్లను తనిఖీ చేస్తున్న ఆర్టీవో, ఆర్టీసీ అధికారులు

వాహనాల డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తాడికొండ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వాహనాల డ్రైవర్లు తప్పకుండా నిబంధనలు పాటించాలని గుంటూరుజిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ కోరారు. మంగళవారం తాడికొండ అడ్డరోడ్డులో ఆర్టీసీ, ఆర్టీవో అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఆర్టీసీ ఆర్ఎం అదేశాల మేరకు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నెలలో నాలుగు ప్రాంతాల్లో ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాడికొండ అడ్డరోడ్డు, పేరేచర్ల, నారాకోడూరు, ప్రత్తిపాడులో అవగాహన కల్పించామని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. మైనర్లు ద్విచక్రవాహనాలు, ఆటోలు, టాటాఎస్‌లు నడిపినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు అనిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు, మంగళగిరి, తెనాలి బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు సౌజన్య, విజయసారధి, రాఘవరావు, ఆర్‌టీసీ డిపో-1 మేనేజర్ రామకృష్ణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీజీ నాయక్, ఆర్‌టీసీ సిబ్బంది శంకర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాయుగుండం

రైతుకి గండం

వట్టిచెరుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తూర్పు బంగాళాఖాతంలో వాయుగుండం రైతులకు గండంగా పరిణమించింది. వాయుగుండ ప్రభావంపై వాతావరణ శాఖ హెచ్చరికలు, మంగళ వారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణంలో వచ్చిన మార్పులతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వరి పైరు కోత దశలో ఉంది. ఈ సమయంలో వర్షాలు కురిస్తే అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. ఇటీవల పెను గాలులతో కూడిన తేలిక పాటి వర్షానికి కోత దశలో ఉన్న వరి పైరు నేల వాలటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పది రోజులుగా యంత్రాల ద్వారా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం వర్షం పడక పోయినా ఆకాశంలో కారు మబ్బులు, దట్టంగా కమ్మిన పొగ మంచుతో రైతులు హడలి పోయారు. యంత్రాల ద్వారా కోసిన వరి ధాన్యం ఆర బోసిన ప్రాంతాల్లో వాటిని భద్ర పరిచేందుకు నానా తంటాలు పడుతూ టార్పాలిన్ పట్టాలను సిద్ధం చేసుకున్నారు. తుపాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని చేతికి అంది వచ్చిన వరి పంటను దక్కించుకొనేందుకు రైతులు రాత్రి సమయాలోనూ యంత్రాల సాయంతో వరి కోతలను వేగవంతం చేశారు. వచ్చిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు వివిధ రూపాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు.



వరి కోత కోస్తున్న యంత్రం

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి



వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా రైతులు వరి కోతలను ముమ్మరం చేశారు. అదే క్రమంలో పంట రక్షణ కోసం ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కోతకోసి ఆరబెట్టిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో భద్రపరుచుకోవాలి.

- ఏవో కే.లక్ష్మి



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



దౌర్జన్యం చేస్తున్నాడంటూ ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యాపారం చేసుకునేందుకు రేకుల షెడ్డును అద్దెకు తీసుకొని దాని అద్దె చెల్లించే విషయమై యజమానిపై దౌర్జన్యం చేస్తున్నాడంటూ అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక సుల్తానాబాదుకు చెందిన బిట్రా వెంకట పద్మావతి చెందిన రేకులషెడ్డును మెఘావత్ హరానా నాయక్ గత కొంత కాలంగా అద్దెకు తీసుకొని అప్పడాల తయారుచేసే కంపెనీ నడుపుతున్నాడు. ఈ క్రమంలో అద్దె చెల్లింపుల విషయంలో జాప్యం చేస్తుండటంతో యజమాని అద్దె చెల్లించాలని కోరారు. దీనితో వాళ్లపై దౌర్జన్యానికి దిగి అద్దెకు తీసుకున్న షెడ్డును కూల్చివేశాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించండి

● పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లపై ఆక్రమణలను తొలగించాలని పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 27వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ అరుణ తదితురులు

పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భఆ ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు మురుగు కాలువలను, డ్రెయిన్‌లను ఆక్రమించి కట్టడాలను నిర్మించరాదని, అటువంటి కట్టడాలను తొలగిస్తామని హెచ్చరించారు. వ్యర్థాలను కాలువలలో వేయరాదని అన్నారు. ఇంటివద్దనే పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పట్టణ సుందరీకరణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ, మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఏఈ సునీల్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబరు 16న ధనుర్మాస వ్రతాలు ప్రారంభం

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస వ్రతాలు మహోత్సవాలు డిసెంబరు 16న ప్రారంభమవుతాయని నరేంద్ర రామానుజ దాసస్వామి తెలిపారు. బస్‌స్టేషన్ సమీపంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల రోడ్డులో జనవరి 13 వరకు ఉత్సవాలు జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో చెప్పారు. ప్రతిరోజూ తిరుమంజనం, అష్టోత్తర శత నామార్చన, తిరుప్పావై, గోపూజ, తీర్థగోష్టి, విష్ణుసహస్ర నామ పారాయణ జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు శరణగతి ఘోష్టి ట్రస్ట్ సభ్యులను సంప్రదించాలన్నారు.

క్షీర విప్లవ పితామహుడు కురియన్

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిలో దేశాన్ని అగ్ర భాగాన ఉంచిన క్షీర విప్లవ పితామహుడు కురియన్ అని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.నాగేశ్వరరావు చెప్పారు. డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి పురస్కరించుకుని పశు వైద్యశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ పాల దినోత్సవం ఆయన స్మారకార్థం జరుపుకుంటామన్నారు. పాల ఉత్పత్తిలో పరిశోధనలు చేసి పాడి పరిశ్రమ అభివృద్ధి కావడానికి ఎన్నో కుటుంబాలు దానిపై ఆధారపడి జీవించేందుకు దోహదపడ్డారని చెప్పారు. డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ వర్గీస్ కురియన్‌కు నివాళి అర్పిస్తున్న సంగం అధికారులు

సంగం డెయిరీలో...

చేబ్రోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వర్గీస్ కురియన్ క్షీర విప్లవ సారథిగా గుర్తింపు పొందారని సంగం డెయిరీ చీఫ్ ఫైనాషియల్ ఆఫీసర్ పెద్ది సాంబశివరావు అన్నారు. మంగళవారం వడ్లమూడి సంగం డెయిరీలో నేషనల్ మిల్క్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్గీస్ కురియన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పాడి పరిశ్రమ అభ్యున్నతికి డాక్టర్ వర్గీస్ కురియన్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఆలపాటి సత్యనారాయణ, సీనియర్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, జనరల్ మేనేజర్ డాక్టర్ కేవీ ప్రసాద్, బి సందీప్, బి ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వితరణ

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్ మున్సిపల్ పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో మంగళవారం స్టీలు ప్లేట్లు, గ్లాసులు బహూకరించారు. మధ్యాహ్న భోజన పథకానికి గాను దాతల సాయంతో నిర్వహించిన కార్యక్రమంలో నేరెళ్ల వెంకటకృష్ణమోహన్, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, శ్రీకుమార్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు వర్షం భయం.. మరోవైపు జోరుగా వరి కోతలు

- రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న వాయుగుండం
- వాతావరణంలో మార్పులు... ఆందోళనలో రైతన్నలు
- పంటలను రక్షించుకోవటానికి ఉరుకులు, పరుగులు


కొల్లిపరలో యంత్రం నూర్పిడి చేసిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా గోతాలకు ఎత్తుతున్న కూలీలు


కొల్లిపర మండలం తూములూరు సమీపంలో నూర్పిడి చేసిన ధాన్యాన్ని గుట్టగా పోస్తున్న యంత్రం


తెనాలి ప్రాంతంలో ట్రాక్టర్ల సాయంతో ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు

కొల్లిపర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం కారణంగా డెల్టా ప్రాంతంలోని రైతుల గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. మంగళవారం ఉదయం ఒక్కసారిగా వాతావరణం పూర్తిగా మారింది. కారుమబ్బులు కమ్మటం ... పలుచోట్ల చినుకులు పటడంతో రైతుల గుండెలు గుభిల్లుమంటున్నాయి. ఖరీఫ్ పంట ఇంటికి చేరుతోందో లేదో అని రైతన్నలు మధనపడుతున్నారు. వివిధ దశల్లో పెరిగిన వరి పైర్లు కొంత కోతకోసి ఓదెలపై ఉండగా మరి కొంత నిలువు పైరుపైన ఉంది. కొల్లిపర మండలంలో 50శాతం మంది రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి చేయగా మరో 50శాతం మంది రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి చేయటానికి సిద్ధంగా ఉన్నారు. అయితే వాతావరణంలో వచ్చిన మార్పులు కారణంగా కొంతమంది రైతులు యంత్రాల ద్వారా చేస్తున్న నూర్పిడిని నిలిపివేశారు. కొంత మంది రైతులు యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన ధాన్యాన్ని పంట పొలాల్లో, గ్రామాల్లో ఆరబెట్టారు. ఈ తరుణంలో వర్షాలు పడితే పంట చేతి కందే పరిస్థితి లేదని రైతన్నలు ఆవేదనకు గురవుతున్నారు. చేతికి వచ్చిన వరి పంట ఎక్కడ దెబ్బతింటుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు రావటంతో యంత్రాల ద్వారా నూర్పిడిచేసి ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు హడావిడిగా గోతాలకు ఎత్తి ట్రాక్టర్ల ద్వారా గృహాలకు తరలించారు. వర్షం పడితే వరి గడ్డి కూడా దెబ్బతింటుందని రైతులు భావించి యంత్రాల ద్వారా కట్టలు కంటించిన వరిగడ్డిని ట్రాక్టర్ల ద్వారా ఇంటికి తరలిస్తున్నారు.

హార్వెస్టర్లతో ఊపందుకున్న కోతలు

తెనాలి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెనాలి మండలంలోని 18 గ్రామాల్లో 15000ఎకరాల్లో వరిపైర్లు సాగుచేపట్టగా ఇప్పటికే కోతదశకు చేరాయి. పలు గ్రామాల్లో హార్వెస్టర్ల సహాయంతో కోతలు కోయించి ధాన్యాన్ని తరలించుకుంటున్నారు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి వస్తోంది. గతంలో వరి కోతలు కూలీలతో కోయించి కట్టలుకట్టి కుప్పగా వేయించేవారు. రబీ పూర్తయిన తరువాత ధాన్యాన్ని నూర్పిడి చేసేవారు. దానికి ఎక్కువ ఖర్చు అవుతుందన్న ఉద్దేశంతో హార్వెస్టర్ల సాయంతో కోతలు కోయిస్తున్నారు. ఇందుకు గతంలో గంటకు రూ.2700 ఉండగా ప్రస్తుతం రూ.3000 నుంచి 3200 వరకూ పెరిగింది. హార్వెస్టర్‌తో కోతలు కోయిస్తే ధాన్యం వెంటనే రావడంతో పాటు ట్రాక్టర్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే అవకాశం ఉండటంతో ఎక్కువమంది అటువైపే మొగ్గు చూపుతున్నారు.

దళారులకు అమ్ముతున్న రైతులు

ఈ ఏడాది రైతు సేవా కేంద్రాల ద్వారా 75 కేజీల బస్తా గ్రేడ్ ఏ రకం రూ.1740కి, సాధారణ రకం రూ.1725కి కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యానికి 17శాతానికి మించి తేమ ఉండకూడదన్న నిబంధనలతో పాటు, ఈ క్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకున్న వారి వద్ద మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అంతేకాకుండా ధాన్యాన్ని రైతు తనకు ఇష్టమైన మిల్లర్లకే విక్రయించే వెసులుబాటును కూడా ప్రభుత్వమే కల్పించింది. అంతే కాకుండా వాట్సాప్ నెంబరు 7337359375 ద్వారా స్లాట్ బుక్ చేసుకోనేలా కూడా వెసులుబాటు కల్పించింది. జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటుచేసి 9491392717 నెంబరును కూడా అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు అమ్ముకుని నష్టపోయే వీలులేకుండా అన్ని ఏర్పాట్లను చేసింది. అయినా కొందరు రైతులు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన చేదు అనుభవాలతో దళారులను ఆశ్రయిస్తూ నష్టానికి అమ్ముకునే పరిస్థితి మండల గ్రామాల్లో నెలకొంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో భయం ఒక పక్క ఉంటే మరోపక్క కొనుగోలు కేంద్రాల్లో గత ప్రభుత్వం మాదిరి తమకు న్యాయం జరగదన్న భయంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. వారు 75 కేజీల ధాన్యం బస్తాను రూ.1300 నుంచి 1400 వరకూ కొనుగోలు చేస్తూ రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మితే బస్తాకు 300 వంతున రైతులు లాభం గడించే అవకాశం ఉంటుంది.

అవగాహన పెంచితే రైతులకు మేలు


గోపిశెట్టి అప్పారావు (ముసలయ్య)

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కలిగిస్తే దళారులను ఆశ్రయించకుండా గిట్టుబాటు ధరలకు అమ్ముకుని సంతోషంగా గడిపే పరిస్థితి అన్నదాతలకు ఉంటుందని ఖాజీపేటకు చెందిన గోపిశెట్టి అప్పారావు (ముసలయ్య) చెబుతున్నారు. గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధర అని చెప్పడమే గాని కొనుగోలు చేసి సొమ్మును సకాలంలో ఇచ్చిందే లేదని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తమ గ్రామంలో పంట కాలువలు పూడిక తీయించిందని ధాన్యం కూడా బాగా పండాయని చెబుతున్నారు. గిట్టుబాటు ధరలపై రైతులకు అవగాహన పెంచడంతో పాటు ఈ క్రాప్, ఈకేవైసీ నిబంధనలలో సడలింపు చేస్తే మరింత మంచి జరిగి ఇది మంచి ప్రభుత్వమని రైతులు గుండెల్లో పెట్టుకుంటారని ఆయన తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

తెనాలి, మారీసుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర ప్రాంతాలలో రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా ఛైర్‌పర్సన్ రాధిక భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్, మున్సిపల్ మేనేజర్ చండి దేవసేన, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక చెంచుపేటలోని జేఎంజే కళాశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ షైనీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలజ్యోతి, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి సీహెచ్ విశ్రాంతమ్మ, కె జ్యోతి, ఎం వనజ, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: దేశానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అత్యుత్తమ రాజ్యాంగం అందించారని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మద్దాళి శేషాచలం, తాడిబోయిన రాధిక, మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు హరేరామ్, అనీల్, శ్రీనివాసరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ముత్తింశెట్టిపాలెంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరు శశి, దారా రామకృష్ణ, ద్వారక శ్రీను, బుల్లియ్య ఆదిమ్మ తదితరులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

పొన్నూరులో..

పొన్నూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అన్నారు. మంగళవారం పొన్నూరు పట్టణంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్నికి జై భీమ్ సమూహ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని ప్రజా సంఘాల నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దళిత మహాసభ, మాల మహాసభ ఎరుకుల హక్కుల సంఘం, అంజుమన్ కమిటీ, బహుజన రచయితల వేదిక వంటి ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.మానవ హక్కుల వేదిక కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.రాజారావు, జీఎస్ రాయిల్ వంటి సంఘాల నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాయలంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. పీబీఎన్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శివకుమరి, న్యాయవాది జీఎస్ రాయిల్, జి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రామస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం


కోటి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాలాజీరావుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయంలో మంగళవారం కోటి దీపోత్సవం నిర్వహించారు. పేరం సంజీవరెడ్డి, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. అర్చకులు సుందరాచారి, నాగమారుతి, దీపోత్సవ విశేషాలు వివరించారు. శ్రీనివాసరెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. చెంచుపేటలోని శ్రీగోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి పురస్కరించుకుని లక్ష తులసీ పూజ నిర్వహించారు. సత్యనారాయణ, ఉమామహేశ్వరరావు, కృష్ణాకుమారి పర్యవేక్షించారు.

108 శివలింగాలకు అభిషేకం

కొల్లిపర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి, భూదేవి సమేత జనార్థనస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. మహిళలతో ఆఖండ దీపారాధన, తులసీ దళం వంటి పూజలు చేయించారు. అనంతరం పండితులు కుటుంబరావు, జగన్నాథాచార్యులు, పోగుల రామ లింగేశ్వశర్మలు పుట్టమట్టితో తయారు చేసిప 108 శివ లింగాలకు పంచామృతాలతో అభిషేకం చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


కొల్లిపరలో 108 శివలింగాలకు పూజలు చేస్తున్న మహిళలు

కొలకలూరులో పైపులైన్లను పరిశీలించిన అధికారులు

● 10 రోజుల్లో లీకుల సమస్యను పరిష్కరిస్తామని హామీ

'ఆంధ్రజ్యోతి'కి స్పందన


మురుగు కాలువలో కుళాయిలు, పైపులను పరిశీలిస్తున్న అధికారులు

తెనాలి మారీసుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కొలకలూరులో కలుషిత తాగునీరు కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలోని పేదల కాలనీలో పర్యటించారు. అక్కడ పైపులైన్లు మురుగు కాలువలో ఉండటాన్ని గుర్తించారు. జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా ఏర్పాటుచేసిన పైపులను వాటికి అవుతున్న లీకులను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారు పడుతున్న అవస్థలను వివరించారు. నీరు రాకపోవడంతో డ్రమ్ముల సాయంతో బయట నుంచి తీసుకువస్తున్నామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద కుళాయి కనెక్షన్ నిరుపయోగంగా మారిందని వివరించారు. నిబంధనల ప్రకారం పనులు జరిగేలా చర్యలు చేపట్టి తాగునీరు సురక్షితంగా అందేలా చూస్తామని, మరో పదిరోజుల్లో లీకులు పూర్తి స్థాయిలో అరికట్టడం జరుగుతుందని అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, ఈవోపీఆర్డీ వైవీడీప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అనూష, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

మండలంలోని కొలకలూరులో ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై అధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలో పనికల్పించాలని అర్జీలు పెట్టుకున్నా తనకు పనిచూపడం లేదని ఓ మహిళ ఫిర్యాదు మేరకు విచారణ జరిపారు.

రబీ పంట సాగుపై రైతులకు అవగాహన

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్త శ్రీలతవాణి రైతులకు అవగాహన కల్పించారు. జగ్గడిగుంటపాలెం, బుర్రిపాలెం గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాల్లో మంగళవారం లాంఫాం శాస్త్రవేత్తలు పొలం బడి నిర్వహించారు. జొన్న, మొక్కజొన్న పంటల్లో కలుపు యాజమాన్యం, తెగుళ్ల నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శాస్త్రవేత్త దయానా మాట్లాడుతూ, గులాబీ రంగు కాండం పురుగు, కత్తెర పురుగు, రసం పీల్చే పురుగుల నివారణకు మందులు సూచించారు. వ్యవసాయ శాఖలో రైతుల కోసం అమలవుతున్న పథకాలను, పంటల బీమా, ధాన్యం కొనుగోలు కేంద్రాల అంశాలను వివరించారు. రాజవంశీ, ప్రేమ్‌సాగర్, మోహన్, గోపి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్నఏడీఏ రామకోటేశ్వరి తదితరులు

ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం: ఏడీఏ

పొన్నూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేస్తామని ఏడీఏ వి.రామకోటేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని ములుకుదురు చింతలపూడి రైతు సేవా కేంద్రాల క్లష్టర్ పరిధిలో మంగళవారం రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేశారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యంను 75కేజీల బస్తా గ్రేడ్ ఎ రకం రూ.1740కి కొనుగోలు చేసినట్లు వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాలు సమీపంలోని రైస్ మిల్లులకు జీపీఎస్ ట్రాకింగ్ ఉన్న వాహనాల ద్వారా సరఫరా చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, కొనుగోలు ఏజెన్సీ డీసీఎంఎస్ ఇన్‌చార్జి రవి బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.05 కోట్లతో అభివృద్ధి పనులు

వీరమాచినేని జగదీశ్వరరావు (పీఆర్ ఏఈ, పెదకాకాని)





పెదకాకాని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.3.05 కోట్లతో అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు పెదకాకాని మండలం పంచాయతీరాజ్ ఏఈ వీరమాచినేని జగదీశ్వరరావు మంగళవారం వెల్లడించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై ఆంధ్రజ్యోతికి వెల్లడించిన వివరాలు.

ప్రశ్న: మండలంలో ఎన్ని కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి?
ఏఈ: మండల పరిధిలోని 12 గ్రామాల్లో రూ.3.05 కోట్లతో అభివృద్ధి పనులు జరిపిస్తున్నాం.
ప్రశ్న: మండలంలో షాదీఖానాలు ఎన్ని కట్టనున్నారు?
ఏఈ: ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు పెదకాకాని, నంబూరులో షాదీ ఖానాల నిర్మాణానికి రూ.నాలుగు కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేశాం.
ప్రశ్న: కొప్పురావూరు, జొన్నలగడ్డ మధ్య లింకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారా?
ఏఈ: జాతీయ రహదారి నుంచి కొప్పురావూరుమీదగా జొన్నలగడ్డ వరకు లింకురోడ్డు 6కిలోమీటర్ల మేరకు రూ.4.71 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.
ప్రశ్న: రైతులకు కావలసిన లింకు రోడ్లు ఏమైనా ఏర్పాటు చేస్తున్నారా?
ఏఈ: రైతులకు కావలసిన లింకురోడ్ల ఏర్పాటు త్వరలోచేస్తాం. ఇప్పటికే జాతీయ రహదారి నుంచి నంబూరు మీదుగా దేవరాయబొట్లపాలెం వెళ్లేందుకు సుమారు 9.80 కిలోమీటర్ల మేరకు రోడ్డు ప్రతిపాదన సిద్ధం చేస్తున్నాం.
ప్రశ్న: గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారా?
ఏఈ: మరమ్మతుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులను రోడ్లు భవనాల శాఖ అధికారుల పర్యవేక్షిస్తున్నారు. పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్) వాళ్లు చూస్తున్నారు.

కోట్లు ఖర్చు చేస్తున్నా కనిపించని పచ్చదనం



పట్టణంలో పచ్చదనం కోసం మున్సిపాలిటీ రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తరుచూ వచ్చే పార్టీ కార్యాలయం ముందు ఉన్న రోడ్డు డివైడర్‌పై ఉంచిన పూలకుండీల మొక్కలు లేక పగిలిపోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఇక మంత్రి కార్యాలయం వద్దే ఈ విధంగా ఉంటే ఇక పట్టణంలో పచ్చదనం ఏ మాత్రం చిగురిస్తుందో అర్థం చేసుకోవచ్చు. సారవంతమైన నేల, నీటి సమస్య లేని తెనాలిలో మున్సిపల్ అధికారులు కొద్దిగా శ్రద్ధ పెడితే పట్టణం పచ్చదనంతో నిండిపోతుంది. - తెనాలి క్రైం, ఆంధ్రజ్యోతి


వైసీపీ నాయకుడు సుభానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

సభ్యత్వం, గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుకు కృషి చేయాలి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం, గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. మారీసుపేట పెండేల కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, నియోజకవర్గంలో కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం పొందేలా చూడాలని, తద్వారా పొందే లబ్ధిని కూడా వివరించాలన్నారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్లుగా చేరేందుకు మరో అవకాశం వచ్చిందని, జాబితాలు ప్రకటించినందున వాటిని పరిశీలించి ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారిని కూడా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధిని కూడా అమలు పరుస్తుందన్నారు. ఐదేళ్ల పాటు ప్రయాణులకు నరకం చూపిన రహదారుల అభివృద్ధిని సంక్రాంతికల్లా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రాధాన్య అంశాల వారీగా అభివృద్ధి జరుగుతుందని సంక్షేమం అందుతుందని చెప్పారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన రేపల్లె సుభానిని కండువావేసి ఆహ్వానించారు. అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మంగమూరి హరిప్రసాద్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ పెండేల వెంకట్రావు, మహ్మద్ ఖుద్దూస్, తాడిబోయిన హరిప్రసాద్, రావి కృష్ణమోహన్, జొన్నాదుల మహేష్, కేసన కోటేశ్వరరావు, భీమవరపు చిన కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రగడ కోటయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రగడ కృషి: జొన్నాదుల

తెనాలి అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రగడ కోటయ్య ఎంతగానో కృషి చేశారని పద్మశాలీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ చెప్పారు. ప్రగడ కోటయ్య నగర్‌లో మంగళవారం ఆయన వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 38 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా పని చేశారని, ఎంపీగా కూడా సేవలు అందించి బీసీల అభ్యున్నతికి పాటు పడ్డారని చెప్పారు. చేనేత పరిశ్రమ సంక్షోభం నుంచి బయట పడేందుకు నిరాహార దీక్ష చేశారని, 200లకు పైగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు చేయూత ఇచ్చి ఆ రంగంపై ఆధారపడ్డ ఎందరికో దారి చూపారన్నారు. నైతిక విలువలకు కట్టుబడి రాజకీయాలు చేసిన ప్రగడ కోటయ్య రాజకీయ నాయకులందరికి ఆదర్శం కావాలన్నారు. దీవి హేమంత్‌కుమార్, గోలి శ్రీనివాసరావు, తిరువీధుల సాంబశివరావు, పంచుమర్తి భాస్కరరావు, బాలశ్రీనివాసరావు, శివప్రసాద్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రగడ కోటయ్య అనుక్షణం పాటుపడ్డారని వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు ప్రగడ వీరభద్ర బాలాజీ అన్నారు. స్థానిక వీవర్స్ కాలనీలో మంగళవారం ప్రగడ కోటయ్య 29వ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వీవర్స్ కాలనీలోని కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం నేత కార్మికుల కోసం ప్రగడ కోటయ్య చేసిన పోరాటాలు మననం చేసుకున్నారు. కార్యక్రమంలో మకాని రమేష్, ఆరె వెంకట్రావు, సొసైటీ మేనేజర్ బాజీ, నేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.